# నవతెలంగాణ

1

# మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 15 అక్టోబర్ 2023 | www.navatelangana.com


## 'ఆరు గ్యారంటీ'లపై అవగాహన



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు పుట్ట నరసింహారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతి ఏటా రూ.15 వేల పంట సాయం లాంటి తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమర్ ల్యాబ్ ఘటనపై నివేదిక అందజేస్తాం

క్షతగాత్రులను పరామర్శించిన తాసిల్దార్ రవికుమార్



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని బొల్లారం పారిశ్రామిక వాడకు చెందిన అమర్‌ల్యాబ్ కెమికల్ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనపై జిన్నారం తహశీల్దార్ రవికుమార్ ఆరా తీశారు. ఈ మేరకు శనివారం ప్రత్యేకంగా వెళ్లి.. క్షతగాత్రులను పరామర్శించారు. ఘటన పూర్వాపరాలను తెలుసుకొని వారికి భరోసా కల్పించారు. ఘటనకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ ఘటన ప్రమాదమా, మానవ తప్పిదమా అనే అంశాల నేపథ్యంలో విచారణ చేపడతామన్నారు. బాధిత కార్మికులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ద్వారా అందాల్సిన తక్షణ సాయాన్ని వెంటనే అందజేస్తామన్నారు.



## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మేందర్ బాపురావు, దేవునూర్ గ్రామానికి చెందిన షరీఫ్ మియా కాంగ్రెస్‌ను వీడి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అశోక్ గౌడ్, మోహిన్ తదితరులు ఉన్నారు.




## నిజాలు చెప్తే దేశద్రోహులుగా ముద్ర

**ప్రశ్నించే తత్వాన్ని మోడీ సర్కార్ జీర్ణించుకోలేకపోతోంది**

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్**

నవతెలంగాణ-సంగారెడ్డి

నిజాలు చెప్పేవారినే మోడీ సర్కార్ దేశద్రోహులుగా ముద్ర వేస్తోందని, ప్రశ్నించే తత్వాన్ని జీర్ణించుకోలేకపో తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ విమర్శించారు. సంగారెడ్డిలో రెండ్రోజులుగా జరుగుతున్న సీపీఐ(ఎం) జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం ఆయన హాజరై మాట్లాడారు. స్వతంత్ర మీడియాపై బీజేపీ కుట్రలు ఫలించబోవన్నారు. న్యూస్ క్లిక్, ద వైర్ తదితర స్వతంత్ర మీడియా సంస్థలను నాశనం చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా స్వేచ్ఛను హరించే విధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. ప్రజాసా వ్యామ్యాన్ని కాలరాస్తున్న మోడీ సర్కార్‌ను వచ్చే ఎన్నికలలో సాగణం పాలన్నారు. కార్మికులు, అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారు చేస్తున్న ఉద్య మాలను కవర్ చేస్తున్నందునే న్యూస్ క్లిక్‌పై బీజేపీ, ఆర్ఎస్ఎస్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. పత్రికా స్వేచ్ఛపై మోడీ సర్కార్ దాడినీ ఖండించాలన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేకూరుస్తూ ప్రజల నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. అచ్చే దిన్ పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ మాయ మాటలతో దేశ ప్రజలను మోసం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్యవర్గ సభ్యులు రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింహారెడ్డి తది తరులు పాల్గొన్నారు.




## ప్రవల్లికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

**నిరుద్యోగులపై లాఠీచార్జీ హేయమైన చర్య**

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రమేష్**

నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రూపు-2 పరీక్ష వాయిదా పడిందని మనస్థాపానికి గురై హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ఓ ప్రయివేటు హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన నిరుద్యోగ విద్యార్థిణి ప్రవల్లికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నాయకులు అన్నారు. సంగారెడ్డిలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, నల్లవల్లి రమేష్‌లు మాట్లాడుతూ..రాష్ట్రంలో గత సంవత్సరం కాలంలో ఇది 8వ నిరుద్యోగ ఆత్మహత్య అని అన్నారు. సరైన ప్రణాళిక లేకుండా రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ వ్యవరిస్తున్నదన్నారు. పరీక్ష నిర్వహణలో లోపభూయిష్టంగా ఉందన్నారు. కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు చెల్లించి, హాస్టల్స్ లో వేలాది రుపాయాలు ఖర్చు చేస్తూ నిరుద్యోగులు చదువు కుంటు న్నారని.. వారీ ఇబ్బందులు ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అధికారం కోసం ఇస్తున్న ప్రాధాన్యత కనీసం విద్యార్థి, నిరుద్యోగులకు భరోసా కల్పించడం లేదన్నారు. విద్యార్థి మరణిస్తే కనీసం వారి కుటుంబానికి భరోసా ఇచ్చే సమయం లేదా అని ప్రశ్నించారు. మృతురాలి కుటుం బా నికి న్యాయం చేసి ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. నిరుద్యోగుల పై పెట్టిన కేసులను ఎత్తివే యాల ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా ఎస్ ఎఫ్ఐ నిలుస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, సహాయ కార్యదర్శి రాజేష్, నాయకులు శీను పాల్గొన్నారు.

## నర్సాపూర్ టికెట్ మదన్ రెడ్డికే ఇవ్వాలి



నవతెలంగాణ-హత్నూర

నర్సాపూర్ ఎమ్మెల్యే టికెట్ మదన్ రెడ్డికే ఇవ్వాలని మధుర సర్పంచ్ మాధవి నవీన్ గౌడ్ అన్నారు.శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబా టులో ఉంటూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కష్టపడుతున్నారన్నారు. కాబట్టి మరోమారు ఆయనకే టికెట్ ఇవ్వాలన్నారు. లేని ఎడల హత్నూర మండల వ్యాప్తంగా భారీగా సర్పంచులు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

## సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వరంగల్‌కి చెందిన పల్లవి అనే యువతి ఆత్మహత్య చేసుకోవడం పై నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సమస్యకు పరిష్కారం వెతుకాలని ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వం పదే పదే పరీక్షలను రద్దుచేయడం వాయిదా వేయడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో ఖచ్చితత్వంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారు.. కానీ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదన్నారు. పరీక్షలు కాకుండా ఎన్నికలు వాయిదా వేయాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. నిరుద్యోగులెవరూ అధైర్యపడొద్దన్ని క్షణికావేశంలో విలువైన ప్రాణాలని పోగొట్టుకుని.. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చవద్దని విజ్ఞప్తి చేశారు.

# నేడు హుస్నాబాద్, 17న సిద్దిపేటలో..

# ప్రజా ఆశీర్వాద సభలు



- కేసీఆర్ ప్రసంగాలపై సర్వత్రా ఆసక్తి
- ఎన్నికల హామీలపైనే చర్చంతా..
- హ్యాట్రిక్ కోసం సెంటిమెంట్‌తో హుస్నాబాద్‌లో షురూ
- లక్ష మంది సమీకరణకు ఏర్పాట్లు.. గులాబీమయమైన హుస్నాబాద్
- సభకు సర్వం సిద్ధం చేసిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్ సభా ప్రాంగణం..

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ బాస్ సీఎం కేసీఆర్ ఎన్నికల యుద్ధానికి బయలుదేరారు. సెంటిమెంట్ ప్రాంతమైన హుస్నాబాద్ కేంద్రంగా ఎన్నికల సమరానికి శంఖారావం పూరించనున్నారు. అనారోగ్య సమస్యతో ఎన్నికల ప్రచార షెడ్యూల్ కాస్త ఆలస్యమైనా లేటెస్ట్‌గానే ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏం చేసిందనేదాని కంటే మూడో సారి గెలిపిస్తే ఏం చేయబోతుందనే విషయాలపైనే ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పదల్చిన హామీల అస్త్రాలను ఒక్కొక్కటిగా కేసీఆర్ వదలనున్నారు. అందులో భాగంగా హుస్నాబాద్‌లో ఆదివారం జరిగే సభలో ఆయన ఏ విషయాల్ని ప్రస్తావి స్తారనే ఆసక్తి రాజకీయ చట్రంలో కనిపిస్తోంది. తెలంగా ణలో సాధించిన ప్రగతిని నివేదించడంతో పాటు రాబోయే ఐదేళ్లల్లో ఏమేం చేయనున్నారనే విషయాల్ని కూడా ప్రకటిం చే అవకాశము ందంటున్నారు. హుస్నాబాద్‌లో జరిగే సీఎం సభకు భారీ జన సమీకరణక ఏర్పాట్లు చేశారు. మంత్రి హరీశ్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కు మార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

### స్పీడందుకున్న ఎలక్షన్ వార్

అభ్యర్థుల ప్రకటనలో ముందున్న బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం లోనూ ముందే ఉంటోంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ ఎన్నికల ప్రచార సభలకు బయలుదేరారు. తొలి దశలో 41 నియోజకవర్గాల్లో ఎన్నికల సభలకు షెడ్యూల్ ప్రకటించారు. అందులో భాగంగా గెలుపు సెంటిమెంట్ కోసం సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లోనే ప్రచారం ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. 17న మంత్రి హరీశ్‌రావు నియోజక వర్గమైన సిద్దిపేటలో ఈ నెల 30న నారాయణఖేడ్ సభకు కూడా కేసీఆర్ హాజరవ నున్నారు. హుస్నాబాద్ సభపై సర్వ త్రా ఆసక్తిని పెంచింది. ఎన్నికల వేళ సీఎం కేసీఆర్ ప్రజల కిచ్చే హామీలేమిటనేది చర్చనీయాంశంగా మారింది. తెలం గాణలోల సాధించిన ప్రగతిని నివేదించడంతో పాటు హాట్రిక్ విజయం సాధిస్తే రాబోయే ఐదేళ్లల్లో ఏమేమి చేయబోతున్నారనే విషయాలేమిటనేది ఆసక్తిని కల్గిస్తోంది. ప్రజల్ని ఆకర్షించే పథకాల్ని ప్రకటించడమే కాకుండా ప్రతిపక్షాల్ని ఎండగట్టేందుకు ఏలాంటి మాటల తూటాల్ని వదులు తారనేది హుస్నాబాద్ సభలో తేలనుంది. మధ్నాహ్నం 1 గంటకు హుస్నాబాద్‌లో జరిగే ఎన్నికల సభకు లక్ష మంది వరకు జనసమీకరణ చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేశారు. కేసీఆర్ సభతో హుస్నాబాద్ గుబాబీమయయంగా మారింది. సభకు సర్వం సిద్ధం చేశారు.

### కేసీఆర్ ప్రసంగంపై ఆసక్తి..

కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ హుస్నాబాద్‌తోనే ప్రారంభంకానుండడంతో ఆయన ప్రసంగం ఎలా సాగునుందనేది ఆసక్తిగా మారింది. ప్రజా ఆశీర్వాద సభలో తెలంగాణ వచ్చాక సాధించిన ప్రగతిని నివేదించడం సర్వ సాధారణమే అయినప్పటికీ మూడో సారి ఎన్నికలకు వెళ్తున్నందున ప్రజలకు ఏ విషయాల్ని చెప్పి ఆకట్టుకుంటారనేది చూడాలి. చేసిన పనుల కంటే రాబోయే కాలంలో చేయబోయే పనులు, పథకాలపైనే కేసీఆర్ దృష్టి సారించే అవకాశముంది. గత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్, సంక్షేమ, అభివృద్ధి పనుల్ని ఏకరువు పెట్టారు. ప్రజలు సైతం విశ్వసించి ఓట్లేసి గెలిపించారు. ముచ్చటగా మూడో సారి ఎన్నికలకు వెళ్తున్నందున బీఆర్ఎస్ పట్ల, కేసీఆర్ పట్ల కాస్త ఆసక్తి తగ్గడమనేది సహజంగా జరిగేదే. ఈ పరిస్థితిని ముందే పసిగట్టిన కేసీఆర్ ప్రజల్ని తమ వైపు తిప్పుకుని నమ్మించేందుకు ఏఏ అస్త్రాలను సంధిస్తారనేది పొలిటికల్ సర్కిల్‌లో ఆసక్తిని పెంచుతోంది. అదిరిపోయే మ్యానిఫెస్టో రూపకల్పన జరుగు తుందని మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ పదే పదే చెబుతూ వచ్చారు. అంత ఆసిక్తిని పెంచే ఆంశాలేమిటనేది ప్రజల్ని కూడా ఎదురు చూసేలా చేసింది. ఇప్పటికే రైతులకు అనేక విధంగా సాయం చేస్తున్న ప్రభుత్వం రాబోయే ప్రభుత్వంలో మరింత చేయాలనే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు ఉచి త ఎరువులు, రైతులకు పించన్ సదుపాయం వంటివి ప్రచారం జరుగుతున్నాయి. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఇతర సాయం చేసే పథకాలుంటాయ ంటున్నారు. నిరుద్యోగ భృతి అనే గత ఎన్నికల హామీ అమలు కాలేదు. ఈ సారి నిరుద్యోగుల్ని ఆకర్షించే పథకం ఉండబోతుంని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఇతర సామాజిక వర్గాలు, ఉద్యోగులకు మేలు చేసే వరాలు ప్రకటిస్తారంటు న్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీలను ప్రజల్లో ఎండగట్టేం దుకు ఏలాంటి విమర్శనాస్త్రాల్ని సంధించే అవకాశంలేకపోలేదు.

### గులాబీ మయం..

కేసీఆర్ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. హుస్నాబాద్ సభకు లక్ష మంది జనసమీకరణకు ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఒడిదెల సతీష్‌కుమార్ తెలిపారు. కేసీఆర్ తొలి ఎన్నికల సభ కావడంతో భారీ జన సమీకరణతో పాటు ఏర్పాట్లు కూడా భారీ స్థాయిలో చేశాంప. మంత్రి హరీశ్‌రావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాంగ్రెస్, సీపీఐ బలమైన ప్రతిపక్షంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకు కేసీఆర్ సభ దోహదపడుతుందని గులాబీ శ్రేణులు చెబుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు గెలిచిన సతీష్‌కుమార్ మూడో సారి హాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే కాకుండా నియోకజవర్గంలో తాగు, సాగునీటిని అందించారు. పదేళ్ల కాలంలో రూ.9 వేల కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు నియోజకవర్గ ప్రజలకు అందించినట్లు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తన ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. హుస్నాబాద్ పట్టణమంతా గులాబీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో నిండిపోయింది. ఎటు చూసినా గులాబీవయంగా మార్చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందుకు నియమావళిని అనుసరించే కేసీఆర్ సభకు ఏర్పాట్లు చేశామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# సీఎం బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు

- సిద్దిపేట సీపీ శ్వేతా రెడ్డి
- పోలీస్ అధికారులకు బ్రీఫింగ్, పలు సూచనలు



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

సీఎం కేసీఆర్ ప్రగతి ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సిద్దిపేట సీపీ శ్వేత రెడ్డి తెలిపారు. హుస్నాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పోలీసు అధికారులకు శనివారం ఏర్పాటుచేసిన సమా వేశంలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సీఎం పర్యటన సందర్భంగా ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సభకు వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు విధి నిర్వహణలో ఉండే పోలీసుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. వాహనాలను పార్కింగ్ ప్రదేశాలలో పార్కు చేయాలని రోడ్డుకు అడ్డదిడ్డంగా పార్కు చేయవద్దన్నారు. అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో 6 సెక్టార్లుగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

### పార్కింగ్ స్థలాలు..

హుస్నాబాద్, అక్కన్నపేట, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాల నుండి వచ్చే వాహనదారులు కరీంనగర్ రోడ్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో మరియు సెంట్ జోసెఫ్ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో వాహనాలు పార్కు చేసుకొని సభాస్థలికి చేరుకోవాలన్నారు. కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల నుంచి వచ్చే వాహనదారులు కరీంనగర్ రోడ్ ఇండియన్ పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో వాహనాలు పార్కు చేసుకొని సభా స్థలికి చేరుకోవాలన్నారు.

### ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్..

హుస్నాబాద్- కరీంనగర్, కరీంనగర్- హుస్నాబాద్ వెళ్లే దారి ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరిగిందని.. ప్రజలు వాహనదారులు ఇది గమనించాలని కోరారు. మధ్యాహ్నం 1:00 నుండి సాయంత్రం 7 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందన్నారు. హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనదారులు నాగారం, మహ్మదాపూర్, బొమ్మనపల్లి, సుందరగిరి నుండి కరీంనగర్ వెళ్లాలన్నారు. కరీంనగర్ నుండి హుస్నాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనదారులు సుందరగిరి, బొమ్మనపల్లి, మహ్మదాపూర్, నాగారం మీదుగా హుస్నాబాద్ రావాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాస్ రావు, ఎస్ మల్లారెడ్డి, రాంచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు సతీష్, రమేష్, చంద్రశేఖర్, రవీందర్ రాజు, సురేందర్ రెడ్డి, సీఐలు, కిరణ్, సత్యనారాయణరెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ రఘుపతిరెడ్డి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ చంద్ర గోల్డ్ సీడ్ రైతుల క్షేత్ర ప్రదర్శన

నవతెలంగాణ-ఝరాసంగం

జహీరాబాద్ మండల పరిధిలోని హగ్గెలి గ్రామ శివారులో గల జీ ప్రకాష్ రైతు పొలంలో వేద సీడ్స్ వారు పత్తి పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ చంద్ర గోల్డ్ బిజీ 2 రకం విత్తనాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ మేనేజర్లు రాజేంద్ర, చక్రపాణి, రీజినల్ మేనేజర్ చెన్నయ్య, క్రిష్టారెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక పద్ధతితో అధిక దిగుబడి నిచ్చే పత్తి వంగడం డాక్టర్ చంద్రగోల్డ్ అన్నారు. అన్ని నేలలకు అనువైనది, అన్ని రకాల వాతావరణాల్లో అధిక దిగుబడి వచ్చే విధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు, డీలర్లు డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.



## సంగారెడ్డిలో ప్రజాశక్తి పార్టీ జెండా ఎగురవేస్తాం

నవతెలంగాణ-సదాశివపేట

వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి గడ్డమీద తెలంగాణ ప్రజాశక్తి పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి దొడ్ల వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న ఎమ్మెల్యే నియోజకవర్గానికి పొరగబెట్టిందేమీ లేదన్నారు. విద్యావంతుడైన తనను ఒక్కసారి గెలిపిస్తే.. సంగారెడ్డి నియోజకవర్గంలో ఐదువేల కోట్లతో అభివృద్ధి చేసి అద్దంలాగా మారుస్తానన్నారు. గజ దొంగలను గెలిపించడం కంటే ఒక్కసారి తనను ఆదరించాలని కోరారు. బ్రహ్మజి, నిరడి రవి ఆధ్వర్యంలో కొంతమంది యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త బస్వరాజ్ పాటిల్, రాష్ట్ర కార్యదర్శి విరేష్ పాటిల్, జిల్లా కారిక విభాగం అధ్యక్షులు కట్కం విరేష్ గుప్త, జిల్లా నాయ కులు బ్రహ్మజీ, సందీప్ పాటిల్, రఫిక్,ఇబ్రహీం పాల్గొన్నారు.

**రియాక్టర్లు పేలి గాయపడిన కార్మికులకు..**

# మెరుగైన వైద్య చికిత్స అందించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తాం
- మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జిన్నారం, ఏడీఏబొల్లారం

బొల్లారం పారిశ్రామికవాడలోని అమర లాబ్స్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రియాక్టర్ల పేలుడులో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను శనివారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉందని తెలియడంతో వెంటనే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో ఫోన్లో మాట్లాడి వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రమాద ఘటనలో పరిశ్రమ నిర్లక్ష్యం కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ పరిశ్రమ కార్మికుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని పలుమార్లు పరిశ్రమల యాజమాన్యాలకు సూచించినట్టు గుర్తు చేశారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి కార్మికులకు మెరుగైన పరిహారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు వి.హనుమంత్ రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, దిననాథ్, శ్రీమన్నారాయణ, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.



### కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి పరామర్శ..

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను బొల్లారం బీజేపీ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి శనివారం ఉదయం పరామర్శించారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు శుక్రవారం రాత్రి ప్రమాద విషయం తెలియగానే హుటాహుటినా ఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రులను బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సుమారు రాత్రి రెండు గంటల వరకు అక్కడే బాధిత కుటుంబ సభ్యులతో ఉండి ధైర్యం చెప్పారు.

# వామపక్షాలతోనే గెలుపోటములు డిసైడ్..

- ఎమ్మెల్యే అభ్యర్థుల విజయంలో కీలకం కానున్న కమ్యూనిస్టులు
- సిద్దిపేట జిల్లాలో నలుగురు సర్పంచులు, ఒక ఎంపీటీసీ, 78 మంది వార్డు మెంబర్లతో పాటు బలమైన నాయకత్వం



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రస్తుతం జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పోటీలో ఉన్న అభ్యర్థుల గెలుపోటములపై వామపక్షలకు సంబంధించిన ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. అభ్యర్థుల విజయానికి వామపక్షాలతో దోస్తానం ఎంతో కలిసి వస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పదవులు ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజలతో, కార్మికుల, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం వామపక్ష నేతలు ఉద్యమిస్తున్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి, వామపక్ష ఉద్యమాలకు కేంద్రంగా సిద్దిపేట జిల్లాలోని అనేక ప్రాంతాలు నిలుస్తున్నాయి. అందులో బైరాన్‌పల్లిలో ఉన్న బురుజు నేటికీ సాక్ష్యంగా నిలిచింది. ముఖ్యంగా సీపీఐ(ఎం) సంబంధించిన నాయకులు జిల్లాలో ఎంపీటీసీగా, సర్పంచులుగా, వార్డు సభ్యులుగా, మత్స్యశాఖ, గొర్ల కాపరుల సంఘం డైరెక్టర్లుగా గెలుపొందారు. దీంతో పాటు ప్రతీ గ్రామంలో కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలతో పాటు.. పార్టీ నాయకత్వం బలంగా ఉన్నది. ఈ అంశాలన్నింటినీ బేరీజు వేసుకుంటే.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు, ఓటములు వామపక్షాలు డిసైడ్ చేస్తాయనడంలో అతిషయోక్తి లేదు.

### మునుగోడు ఎన్నికలే ఉదాహరణ...

రాష్ట్రంలో గత అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందగా, వారి గ్రాఫ్ పెరుగుతున్న సమయంలో మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ వామపక్షాలతో పొత్తు పెట్టుకుంది. దీంతో అక్కడ జయకేతనం ఎగురవేసి.. బీజేపీని ఓడించింది. సిద్దిపేట జిల్లాలో కూడా ముఖ్యంగా హుస్నాబాద్, జనగాం నియోజక వర్గానికి సంబంధించిన క్యాడర్ గ్రామస్థాయి నుంచి పటిష్టంగా ఉంది. దుబ్బాక గజ్వేల్, సిద్దిపేట నియోజక వర్గంలో కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పార్టీ నిర్మాణం జిల్లాలో గ్రామస్థాయి నుంచి పటిష్టంగా ఉందని చెప్ప వచ్చు. జనగామ నియోజకవర్గ ంలోని 4 మండలాల్లో సీపీఐ(ఎం)కు బలిష్టమైన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యక ర్తలు ఉండగా, హుస్నాబాద్ నియోజక వర్గంలో సీపీఐ బలిష్టంగా ఉంది.

### జిల్లాలో వామపక్ష ప్రజాప్రతినిధులు...

జిల్లాలో బీఆర్ఎస్ బలిష్టంగా ఉన్నప్పటికీ కూడా వామపక్షాలకు (సీపీఐ(ఎం)) కు చెందినవారు ప్రజల నుంచి ప్రత్యక్షంగా ఓట్ల ద్వారా ఎన్నికై తమ ప్రాతినిత్యాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నలుగురు సర్పంచులు, ఒక ఎంపీటీసీ, 78 మంది వరకు వార్డ్ మెంబర్లు పదవులలో కొనసాగుతున్నారు. సుమారు ఓ పది స్థానాల్లో స్వల్ప ఓట్ల తేడాతో సర్పంచులుగా పోటీ చేసిన వారు ఓడిపోయారు. ఏడు స్థానాల్లో ఎంపిటిసికి పోటీ చేసిన వారు, కొముురవెల్లి జెడ్పీటీసీకి పోటీగా చేసినవారు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిచవిచూశారు. ఉమ్మడి జనగామ జిల్లాలో చేర్యాల జెడ్పీటీసీగా సీపీఐ(ఎం)కు చెందిన వారే గెలుపొందారు. మత్స్యశాఖ, గొర్ల కాపరుల సంఘం డైరెక్టర్‌లుగా వామపక్ష పార్టీలకు చెందిన వారు కొనసాగుతున్నారు. వీటన్నిటిని బేరిజు వేసుకుంటే నిరంతరం ప్రజాసేవలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న వామపక్షాలకు జిల్లాలో మంచి పట్టు ఉందని చెప్పవచ్చు. వారితో ఏ పార్టీ పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ అభ్యర్థులు మంచి మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదు.



## తెలంగాణలో రాజన్న రాజ్యం కోసం వైఎస్ఆర్‌టీపీ పోరాటం

నవతెలంగాణ-జోగిపేట

రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా తెలంగాణలో రాజన్న రాజ్యం రావాలని.. అందుకు ప్రజలు వైయస్సార్ తెలంగాణ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు టి.నరేష్ విజ్ఞప్తి చేశారు. జోగిపేట పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని 119 స్థానాల్లో వైఎస్సార్ టీపీ పోటీ చేస్తున్నట్టు పార్టీ అధినేత్రి షర్మిల తెలియజేసిందన్నారు. వైయస్సార్ ప్రవేశ పెట్టిన పథకాలను మళ్ళీ తీసుకొని రావాలంటే తమ పార్టీ అధికారంలోకి రావాలని.. అందుకు ప్రజలంతా ఆదరించాలని కోరారు. అందోల్ నియోజకవర్గంల కూడా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ మేనిఫెస్టో త్వరలో ప్రకటిస్తామన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
ఆదివారం | 15 అక్టోబర్ 2023 | www.navatelangana.com

## ఘనంగా ఫరీదోద్దీన్ జయంతి వేడుకలు

**నవతెలంగాణ-జహీరాబాద్**



దివంగత నేత మాజీ మంత్రి కీ.శే మొహమ్మద్ ఫరీదుద్దీన్ జయంతి వేడుకలను పస్తపూర్ చౌరస్తా సమీపంలోని జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్ రావు, టీఎస్ఐడీసీ చైర్మెన్ మొహమ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నరోత్తం, బెవరేజస్ చైర్మెన్ దేవీప్రసాద్‌లు పాల్గొని.. ఫరీదుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫరీద్ సాబ్ సేవలు చిరస్మరణీయ మన్నారు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మెన్‌లు మహంకాల్ సుభాష్ గుప్తా, ముత్యాల చందు, వైద్యనాథ్, మోయుద్దీన్, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యులు శంకర్ రాథోడ్, బిజీ సందీప్, బాల్రెడ్డి, బాబి మాజీ కౌన్సిలర్ లు రాములు నేత, మూతిరాం, అబ్దుల్లా, నామరవి కిరణ్, జహంగీర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు

**నవతెలంగాణ-గుమ్మడిదల**



మండల పరిధిలోని కానుకుంట గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం సభ్యులు భారీ సంఖ్యలో పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమం మరింత ముందుకు వెళ్లాలంటే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతీ ఒక్క ఓటర్ను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్, మండల మైనార్టీ కో ఆప్షన్ సభ్యులు సర్వర్, నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు షేక్ హుస్సేన్, పార్టీ గ్రామాధ్యక్షుడు ముద్రిక చారి, వార్డు సభ్యులు విశాల్‌గౌడ్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, భార్గవ్ చారి, గ్రామ యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**నవతెలంగాణ-జహీరాబాద్**

బీఆర్ఎస్ పట్టణ ప్రదాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్యరావు, టీఎస్ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ పాల్గొని శాలువా పూలమాలతో శ్రీకాంత్‌రెడ్డిని సన్మానించి.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తలకు తగిన సేవలందించడంలో శ్రీకాంత్‌రెడ్డి తనకంటూ గుర్తింపు పొందారన్నారు. ఇలాంటి నాయకులు ఎక్కడైనా ప్రజల, నాయకుల మన్ననలు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సతీష్, అబ్దుల్లా, మోతిరాం రాములు నేత, జహంగీర్, యూనుస్, రంగా అరుణ్ కుమార్, విజయ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్తలు మహంకాల్ తిరుమల్, సంజు,పార్టీ నాయకులు భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగాలి



**నవతెలంగాణ-సంగారెడ్డి**

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు నియమించిన అన్ని విభాగాల అధికారులు సమిష్టి భాగస్వామ్యంతో క్రియాశీలకంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల విభాగపు అధికారులతో పలు అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా అన్ని రకాల ఎన్ఫోర్స్మెంట్ బృందాలు వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన స్టాటస్టిక్ సర్వేలెన్సు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వలెన్స్ బృందాలు, వీడియో వీవింగ్ బృందాలు, ఎంసిసి, వ్యయ నిర్వహణ, ఎంసిఎంసి బృందాలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, మోడల్ పోలింగ్ స్టేషన్లు, పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతుల కల్పన, రిసిప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద ఎక్కడి నుండైనా వీక్షించే విధంగా ఉండే ఐపి బేసిడ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ రూపేష్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ ఎస్పీ అశోక్, డీఎస్పీ, డీఆర్ఓ నగేష్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు..



ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, అదే విధంగా సి-విజిల్ యాప్ ద్వారా ఫోటో, లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ శరత్ తెలిపారు. ఫిర్యాదు దారు వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. సి-విజల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులపై 100 నిమిషాలలోపు చర్యలు తీసుకుంటా మన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సభలు, సవ నావేశాలు, తదితర అనుమతులకు సువిధా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సింగిల్ విండో సిస్టంద్వారా అనుమతులు అందిస్తారని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుం టే వారికి అనుమతి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేల రూపాయల నగదు మించి రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే ఆ డబ్బును సీజ్ చేస్తారని, రూ.10లక్షల వరకు ఉంటే ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం అందిస్తారన్నారు.



## చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి 200 మంది యువకులు

**నవతెలంగాణ-సదాశివపేట**

సదాశివపేట పట్టణంలోని స్థానిక దుర్గా ఫంక్షన్ హాల్‌లో శనివారం సుమారు 200 మందికి పైగా యువకులు రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. తనను నమ్మి వచ్చిన యువకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. 45 రోజులు తనకోసం పనిచేస్తే, ఐదేండ్లు ప్రజలను, నియోజకవర్గ అభివృద్ధికి తాన పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల, మౌళిక సదుపాయాల సంస్థ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## సప్తపురి శనిగట్‌లో ఢిల్లీ వసంత్ ప్రత్యేక పూజలు

**నవతెలంగాణ-ఝరాసంగం**

మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామ శివారులో గల సప్తపురి లో నెలకొన్న శనిఘాట్‌లో ఢిల్లీ వసంత్ శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని కోరుకున్నారు. కాగా తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని, అలాగే మౌలిక సదుపాయాల కొరత ఉందని గ్రామస్తులు ఆయనకు విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందిస్తూ.. గ్రామస్తులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్ పాటిల్, సుదీర్ బండారి, పూలసంతోష్, విశ్వనాథ్ యాదవ్, శ్రీకాంత్, బంటు విశ్వనాథ్, రవి యాదవ్, మోహన్, బాల్‌రెడ్డి, వై.కృష్ణ, మందిరం అధ్యక్షులు శ్రీహరి రెడ్డి, ఢిల్లీ వసంత్ బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

# యజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- అమరా ల్యాబ్‌లో గాయపడిన కార్మికులకు మంచి వైద్యం అందించాలి
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**



అమరా ల్యాబ్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పరిశ్రమలో ప్రమాదం జరిగి.. కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య ఆరోపించారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ధ్వర్యంలో బొల్లారంలోని అమరా ల్యాబ్స్‌లో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మొత్తం పరిశ్రమను తిరిగి చూసి.. అనంతరం కార్మికులతో మాట్లాడి..పరిశ్రమ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. రియాక్టర్లు పేలి.. భారీ ఎత్తున ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం వల్ల పరిశ్రమ పెద్ద ఎత్తున నష్టపోయిందని అలాగే చుట్టూ ఉన్న నాలుగైదు పరిశ్రమలు కూడా ధ్వంసం అయ్యాయన్నారు. యంత్రాలన్నీ కాలి బూడిదయ్యాయన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశంలో విశాలమైన వాతావరణం లేదని, వెంటిలేషన్ కూడా సరిగా లేదన్నారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంగానే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. కాబట్టి వెంటనే సదరు యజమాన్యంపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో 15 మంది దాకా గాయపడ్డారని.. వారందరికీ మంచి వైద్యం అందించాల న్నారు. వైద్య ఖర్చులన్నీ పరిశ్రమ యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ విషయంలో ఏమైనా తేడా వస్తే పరిశ్రమ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## మరో 11 గిన్నిస్ రికార్డ్‌లే లక్ష్యంగా శివాలి జోహ్రీ శ్రీవాస్తవ ప్రదర్శన

**నవతెలంగాణ-పటాన్‌చెరు**



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రీ శ్రీవాస్తవ ఇప్పటికే 13 గిన్నిస్ రికార్డులు సాధించి.. తాజాగా మరో 11 రికార్డులు లక్ష్యంగా శనివారం భారీ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆమె తల్లిదండ్రులు కవితా జోహ్రీ శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవలతో కలిసి అంగామీ పేపర్‌తో రూపొందించిన 6,500 గబ్బిలాలు, 5,500 కార్లు, 3,200 డెనోసార్లు, 1,800 కుక్కలు, 3,600 కప్పలు, 3,100 నెమళ్లు, 2,800 పెంగ్విన్లు, 3,100 పందులు, 4,100 షర్టులు, 6,000 మాప్లే ఆకులతో పాటు 6,200 నిమ్మతొనలను ఒకేచోట ఉంచి, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పారు. అంగామీ కాగితంలో రూపొందించిన వాటిని తయారు చేయడం ఒక ఎత్తయితే, వాటన్నింటినీ ఒకేచోట ప్రదర్శనగా పెట్టడం మరో ఎత్తు. గీతం గణితశాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.మల్లిఖార్జునరెడ్డి వాటికి లెక్కించి అధికారికంగా ధ్రువీకరించారు. ఈ పత్రాలను గిన్నిస్ అధికారులకు పంపి, వారి ఆమోదం తరువాత రికార్డును ఖరారు చేయనున్నారు. శివాలీ ఇప్పటికే 13 గిన్నిస్ వరల్డ్ రికార్డులతో పాటు 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులను నెలకొల్పిన విషయం విదితమే.తాజాగా లక్ష్యించిన మరో 11 గిన్నిస్ రికార్డులను శివాలీ సాధించాలని గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, బీటెక్ తొలిఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ పి.త్రినాథరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభిలాషించారు.



## రాళ్లకత్వలో కాంగ్రెస్ ప్రచారం

**నవతెలంగాణ-జిన్నారం**

మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పథకాలను వివరించారు. రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే అని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, సోలక్పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ రవీందర్ గౌడ్, జిన్నారం మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంగు రమేష్, పార్టీ మండలాధ్యక్షులు వడ్డె కృష్ణ, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ఉపసర్పంచ్లు రవి, రమేష్, ఎస్ సి సెల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ మహేష్, యూత్ కాంగ్రెస్ జిన్నారం మండలాధ్యక్షులు నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి..

**నవతెలంగాణ-రాయికోడ్**



మండల పరిధిలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మంగలి వీరేశం, పలేగొల్ల కృష్ణ కాంగ్రెస్ పార్టీని వీడి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని.. ఆ అభివృద్ధికి ఆకర్షితులై చాలామంది పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బసవరాజ్ పటేల్, డీసీఎంఎస్ మాజీ చైర్మెన్ సిద్ధాన్న పటేల్, బీఆర్ఎస్‌మండల ప్రధాన కార్యదర్శి శంకర్, ఆత్మ కమిటీ చైర్మెన్ విట్టల్, వరం వైస్ చైర్మెన్ తుకారాం, పార్టీ గ్రామాధ్యక్షులు రమేష్, నాయకులు పండరి పటేల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ శాఖ పొదుపు పథకాలపై స్పెషల్ డ్రైవ్



**నవతెలంగాణ-గుమ్మడిదల**

గుమ్మడిదలలో శనివారం పోస్టల్ శాఖ పొదుపు పథకాల పై జిల్లా సబ్ డివిజన్ ఏఎస్‌పి సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈనెల 16 నుంచి 21 వరకు నేషనల్ పోస్టల్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా మేళా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లా డుతూ.. జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 9 నుంచి శనివారం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. నేషనల్ పోస్టల్ వారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్, గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీల ప్రత్యేక మేళాలు పలు గ్రామాలలో నిర్వహించామన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్ లక్ష్యంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 16 నుండి 21 వరకు అకౌంట్స్ ఓపెనింగ్, పాలసీల సేకరణ స్పెషల్ డ్రైవ్ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువకావాలనే ఉద్దేశంతో ఇంటింటికి పోస్టల్ పథకాలు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఈ స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. పుట్టిన పసికందు నుండి వందేండ్ల వయసు గల వారందరికీ వివిధ - పోస్టల్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ పొదుపు పథకాల స్కీములకు అత్యధిక వడ్డీ ఇస్తున్న ఏకైక సంస్థ పోస్టల్ శాఖ మాత్రమే అన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్, గ్రూప్ యాక్సిడెంట్ బీమా పాలసీలు అందజేస్తున్నామన్నారు. కేవలం వార్షిక ప్రీమియం రూ.399, 396తో రూ.20 లక్షల ఇన్సూరెన్స్ వరకు పాలసీలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల, కానుకుంట, అన్నారం, నల్లవల్లి, బొంతపల్లి, బ్రాంచి పోస్ట్ ఆఫీస్‌ల సిబ్బంది,మెయిల్ ఓవరసస్ శంకర్, జీడీఎస్ స్టాఫ్ రాంరెడ్డి, శేఖర్, కవిత, సిందురి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



## ముఖీమ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

**నవతెలంగాణ-సదాశివపేట**

సుప్రీంకోర్టు న్యాయవాది, ప్రముఖ విద్యావేత్త ముఖీమ్ సాబు సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిల్చోదానికి సిద్ధంగా ఉన్నాడని.. కాబట్టి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి టికెట్ ఇవ్వాలని కోరుతూ మన బీసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య యాదవ్, టీజేఏసీ జిల్లా అధ్యక్షులు, ఇలియా షరీఫ్, సదాశివపేట కౌన్సిలర్, మహమ్మద్ ఉస్మాన్ భాయ్, మునిపల్లి రమేష్, కృష్ణమూర్తి బీసీ నాయకులు, మరియు ప్రభు దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జోరుగా స్పోర్ట్స్ మీట్

**నవతెలంగాణ-జిన్నారం**

మండల కేంద్రమైన జిన్నారం లో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాల కళాశాల ఆవరణలో సెవెం త్ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జోరుగా కొనసాగుతున్నాయి. క్రీడల్లో భగంగా రెండో రోజైనా శనివారం రెట్టించిన ఉత్సాహంతో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ప్రతి అంశంలో విజేతగా నిలిచేందుకు నువ్వా.. నేనా అన్నట్టుగా వ్యక్తిగత టీం ఈవెంట్లో తమ ప్రదర్శనను కనబరిచారు. అనంతరం స్థానిక గురుకులం ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ అంశాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు పూర్తయినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం గురుకులం ప్రతినిధులు గాయత్రి, నరహరి, ఇతర గురుకులాలకు సంబంధించిన ప్రిన్సిపల్స్, ఫిజికల్ డైరెక్టర్స్, సిబ్బంది నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కుంటుంబ పార్టీ పెత్తనంతో అణిగిపోతున్న అట్టడుగువర్గాలు

**నవతెలంగాణ-జహీరాబాద్**



రాష్ట్రంలో కుటుంబ పార్టీ పెత్తనంతో అట్టడుగు వర్గాల ప్రజలు రోజురోజుకూ అణిగిపోతున్నారని మాజీమంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లితాండా, మన్నపూర్, ఇప్పేపల్లి, గోడిగార్‌పల్లి, ఖాన్‌జమాల్-పూర్, గోపాన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చిందని.. కానీ కేసీఆర్ గద్దెనెక్కి విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తొమ్మిది వేల పాఠశాలలను మూసేసి పద్దేనిమిది వేల మద్యం దుకాణలను తెరిచారని విమర్శిం చారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు భూములను పంచితే బీఆర్ఎస్ వాళ్ళు భూములను లాక్కున్నారన్నారు. తెలంగాణ వస్తే నీళు వస్తాయన్నారు. కానీ జహీరాబాద్‌కు చుక్క నీరురా లేదని, ఇంకా ఇక్కడి రైతులు బోర్లతోనే వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఇన్ని రోజులు రైతు ఋణమాఫి చేయని కేసీఆర్ ఎన్నికల వేళ రుణమాఫీ అని రైతులను మభ్యపెడు తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని.. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఉజ్వల్ రెడ్డి, మండలాధ్యక్షుడు మాక్సూద్, ఎంపీపీ గుండారెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వృథాగా మిషన్ భగీరథ నీరు
### పట్టించుకోని అధికారులు

**నవతెలంగాణ-కొండాపూర్**

ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే క్షేత్ర స్థాయిలో సరైన నిర్వహణ లేకపోవడంతో భగీరథ నీరు రోడ్లపై పారుతున్నది. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని తాగునీటి పైపు లీకేజీ కావడంతో కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతున్నది. దీని గురించి ఏ ఒక్క అధికారిగానీ, ప్రజాప్రతినిధి గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపి స్తున్నారు. ఇలాగే నిత్యం పలుచోట్ల పైపు లీకేజీలతో తాగునీరు రోడ్లపైనే పారతు న్నదని చెబుతున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని.. ఇప్పటికైనా స్పందించి నీటివృథాను అరికట్టాలని కోరుతున్నారు.



## ముచ్చర్లలో 67వ దీక్ష దివస్

**నవతెలంగాణ-హత్నూర**

మండలంలోని ముచ్చర్ల గ్రామంలో శనివారం బుద్ధ దీక్షా దివస్ నిర్వహించారు. తథా గతుడు, బోధీ సత్వ గౌతమ బుద్ధుడు, భారత రత్న డా:బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లర్పించారు. 1956 అక్టోబర్ 14న మహారాష్ట్రలోని నాగపూర్‌లో సుమారు అయిదు లక్షల మందితో డాక్టర్ అంబేద్కర్ ప్రపంచ శాంతి, సమగ్ర అభివృద్ధి, శాస్త్రీయ దృక్పథం, మూఢ నమ్మకాలనిర్మూలన కోసం అష్టాంగ మార్గాల అనుసరనే ధ్యేయంగా బుద్ధ ధమ్మ దీక్షా తీసుకున్నారని.. అంబేద్కర్ ఆలోచనా విధానాలను, ఆచరణను స్మరించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కల ఖానాపూర్ ఎంపీటీసీ మీనంపల్లి కిషన్ రావు, సర్పంచ్ అనితా యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు మీనంపల్లి సదానందం, గ్రామ నాయకులు మచుకురి శ్రీకాంత్, యువకులు తాల్క కుమార్, మీనంపల్లి అరుణ్ కుమార్, చీమల సందీప్, సుధాకర్, తరుణ్, వై సురేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మోతాదుకు మించిన వాహనాలతో రోడ్డు ధ్వంసం



**నవతెలంగాణ-జహీరాబాద్**

జహీరాబాద్ పట్టణంలోని రాయల్ హార్డ్వేర్ దుకాణ యజమాని మోతాదుకు మించిన వాహనాలను రోడ్డుపై నిలిపి.. సిమెంట్ లారీలను అన్లోడ్ చేస్తుండడంతో రోడ్డు తరచుగా దెబ్బతింటున్నదని స్థానిక ప్రగతి నర్సింగ్ హోమ్ వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ శివ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. దత్తగిరి కాలనీలోని ప్రగతి నర్సింగ్ హోమ్ లైన్‌లో గల అప్రోచ్ రోడ్డును హైవే పైన వున్న రాయల్ హార్డ్‌వేర్ దుకాణం యజమానులు సిమెంటు లారీలతో ధ్వంసం చేస్తున్నారన్నారు. పద్నాలుగు టైర్ల భారీ వాహనాల వల్ల రోడ్డు గుంతలమయం అవుతున్నదన్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు, పోలీసులకు, మోటారు వాహనాల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. సొంత ఖర్చు తో రోడ్డు బాగుచేయించుకున్నప్పటికీ.. మళ్లీ సదరు యాజమాన్యం భారీ వాహనాలతో సిమెంటు లోడులు దింపుతూ రోడ్డు ధ్వంసం చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాయల్ హార్డ్‌వేర్ పై చర్యలు తీసుకోవాలన్నారు.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు

**నవతెలంగాణ-వట్‌పల్లి**

పేకాట స్థావరాలపై దాడి చేసి.. పలువురు పేకాటరాయుళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన దుద్దకొండ చెన్నయ్య గౌడ్ ఛాయ్ హోటల్‌లో గతకొంతకాలంగా కొందరు ఉదయం నుంచి సాయంత్రం వరకు పేకాట ఆడుతున్నారు. ఈ మేరక నమ్మదగిన సమాచారం రావడంతో పోలీసులు శనివారం ఆ హోటల్‌పై దాడి చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారని.. వారి వద్ద నుంచి రూ.1650 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

## మాజీ ఎంపీటీసీని పరామర్శించిన దామోదర్



**నవతెలంగాణ-టేక్మాల్**

మండల పరిధిలోని వెంకటాపూర్ మాజీ ఎంపీటీసీ సక్రు నాయక్ భార్య సునీత అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనరసింహ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె మృతి పట్ల ప్రగాడ సానుభూతి తెలిపారు. దామోదర్ వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్, సీనియర్ నాయకులు సుధాకర్, మల్లారెడ్డి, సత్యనారాయణ, కొట్టి నారాయణ, పాపయ్య, నాగయ్య, చిన్న మల్లేశం, విద్యా సాగర్, కిషోర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, యన్‌యస్ యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ రెడ్డి, సేవాలాల్ నాయకులు తుకారం గౌడ్, ఖలీల్, శివ మల్లయ్య, వసీమ్, రాజేష్ గౌడ్, సాయిబాబా , పట్నం రాజు సంగమేష్ , తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ వారిచే శిక్షణ



**నవతెలంగాణ-చేగుంట**

మండలంలోని బోనాల గ్రామం రైతు వేదికలో సెహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారు మహిళ రైతులకు నేషనల్ ప్లాంట్ హెల్త్ మెనేజ్మెంట్ వారిచే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 55 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ ప్రతినిధి దామోదర్‌చారి మాట్లాడుతూ జీవన ఎరువులను రైతు స్థాయిలో ఏవిధంగా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే పంటకు మంచిచేసే మిత్రపురుగులను ఏ విధంగా కాపాడాలో, రైతు స్థాయిలో ఎలా అభివృద్ధి పరుచుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు యస్ మారుతి, అసిస్టెంట్ ప్రోగ్రాం లీడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రావణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలి

**విశ్వహిందూ పరిషత్ సంఘటన మంత్రి పుట్టి మల్లేశం**



**నవతెలంగాణ-పెద్దశంకరంపేట్**

చత్రపతి శివాజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ మెదక్ జిల్లా సంఘటన మంత్రి పుట్టి మల్లేశం అన్నారు. చత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీశైలం స్మృతి కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన శివాజీ రథయాత్ర శనివారం పెద్ద శంకరంపేటకు చేరుకుంది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ హిందూ సంఘాల ఆధ్వర్యంలో తిరుమలాపూర్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పేట పట్టణ పురవీధుల గుండా బైక్ ర్యాలీ, శోభాయాత్ర నిర్వహించారు. చత్రపతి శివాజీ మహారాజ్ నేటి యువత ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో రథయాత్రకు భారీ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పేట విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఎర్ర శ్రీహరి, ఆర్ఎస్ఎస్ భజరంగ్‌దళ్, హిందూ సంఘాల బాధ్యులు సీతారామారావు దేశ్‌పాండే జంగం రాఘవులు, క్రాంతి లాల్, జైహింద్ రెడ్డి, వీరప్ప, సతీష్ గౌడ్, కృష్ణమూర్తి, సర్వేశ్వర్, సంతోష్ కుమార్ , రవి వర్మ అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**నవ తెలంగాణ-నిజాంపేట**

మండల పరిధిలోని నంద గోకుల్ గ్రామంలో ఇటీవల కాలం లో కొన్ని రోజుల నుంచి అనారోగ్యం తో బాధపడుతున్న పిట్ల దుబ్బవ్వ అనే వృద్ధురాలు శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, నిజాంపేట మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ వెంటనే స్పందించి చరవాణి ద్వారా తన కార్యకర్తలతో రూ.5000ల ఆర్థిక సాయం అందించారు. దాంతో బీజేపీ నాయకులు శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పిట్ల స్వామి, బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు ఎనుగంటి కనకరాజు, బుర్ర వెంకటస్వామి, మ్యాదరి స్వామి, బురని రంజిత్, చాకలి భాను, మ్యాదరి రాజు. పాల్గొన్నారు.

## నేటి నుంచి తూప్రాన్‌లో నవదుర్గ నవరాత్రి ఉత్సవాలు

- హాజరుకానున్న పీఠాధిపతులు



**నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్**

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో మహంకాళి దేవాలయంలో గత 25 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం దీపారాధన, స్వస్తి వాచనం, కలశస్థాపన, చతుసస్తి పూజ, మంగళ నీరాజనం, అనంతరం రుద్ర స్వాహాకార చండీయాగం , పూర్ణాహుతి, గణపతి హెూమం నిర్వహిస్తారు. 16వ తేదీ సోమవారం మహాలింగార్చన, రుద్రాభిషేకం , బిల్వార్చన 17వ తేదీ మంగళవారం అమ్మవారికి శాఖంబరి అలంకరణ, 18వ తేదీ బుధవారం సామాజిక సమరసత కార్యక్రమం, రాత్రి శ్రీ క్షేత్రం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామి వారిచే అనుగ్రహ ప్రాశనం అనంతరం లక్ష పుష్పార్చన నిర్వహిస్తారు. 19వ తేదీ గురువారం చండీయాగం అనంతరం మహా అన్నదానం 20వ తేదీ శుక్రవారం మహిళలతో లక్ష కుంకుమార్చన , మహంకాళి దేవత మూర్తికి 108 కలశాల ద్వారా మహాభిషేకం నిర్వహిస్తారు. 21వ తేది శనివారం రాత్రి 7 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అనంతరం సహస్రదీపాలంకరణ కార్యక్రమం , 22వ తేదీ ఆదివారం సుహాసిని కుమారి పూజ, 23వ తేదీ సోమవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహిస్తారు. దసరా ఉత్సవాల సందర్భంగా రాత్రి 7 గంటలకు సాంస్కృతి కార్యక్రమాలు ఆర్కెస్ట్రా వివిధ రకాల బాంబులతో మల్లె చెట్టు పాము నిర్వహిస్తారు. 25వ తేదీ బుధవారం 12 గంటలకు భక్తజన సందోహంతో అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తారు.

## ఎన్నికలు దండగ అన్న రాములును వెంటనే అరెస్టు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్




**నవతెలంగాణ-సిద్దిపేట**

ఎన్నికలు దండగ అన్న మురంశెట్టి రాములును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి, కేంద్ర , రాష్ట్ర ఎన్నికల సంఘానికి, సిద్దిపేట పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ బోర్డు సభ్యుడు మురంశెట్టి రాములు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపేటలో ఎన్నికలు దండగ అంటూ గోడలపై వందల సంఖ్యలో రాతలు రాస్తున్నారన్నారు. ఆయన వ్యవహరించిన తీరు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అతనిపై వెంటనే అధికారులు కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యదారి మధు, గయాజుద్దీన్, రశద్, అనీల్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అంటేనే దళిత, బీసీ, మైనార్టీ వ్యతిరేక పార్టీ




**నవతెలంగాణ-దుబ్బాక**

బీఆర్ఎస్ అంటేనే దళిత, బీసీ, మైనార్టీల వ్యతిరేక పార్టీ అని బీజేపీ పార్టీ దుబ్బాక మున్సిపల్‌అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావును బద్నాం చేయడానికే బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి నిజంగా దళితులపై ప్రేమే ఉంటే నియోజకవర్గంలో దళిత బంధు ఎందుకు అమలు చేయించలేదని ప్రశ్నించారు. నిజమైన దళిత ద్రోహుల పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. బీజేపీ, ఎమ్మెల్యే రఘునందన్ రావును విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మచ్చ శ్రీనివాస్, శాదుల్ స్వామి, పగుడాల నరేందర్, మరాఠీ బాబు, సుంకోజి ప్రవీణ్, రమేష్‌రెడ్డి, రమనారెడ్డి, యాదగిరి, సంజీవులు, సప్తగిరి, బాచి పలువురున్నారు.

# ప్రలోభాలకు లోనవకుండా ఓటును వినియోగించుకోవాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్ సస్పెన్షన్
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**నవతెలంగాణ-పాపన్నపేట**

ఓటరు ప్రలోభాలకు గురి కాకుండా ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఓటర్లను కోరారు. శనివారం మండల పరిధిలోని మల్లంపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్ రాధాక్రిష్ణను సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ లీస్టులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఎలాంటి ప్రలోబాల ఎర చూపినా, వెంటనే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలో సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. బూత్ స్థాయి అవగాహన గ్రూపులు ఏర్పాటు చేసి, ప్రజలకు ఓటు హక్కు విలువను తెలియజేయాలని నిర్ణయించారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఈ నెల 30వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లీస్టులో ఫోటోలు సరిగా రాని వారు ఇప్పటికే సంబంధిత ఫార్మట్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. శారీరకంగా నడవలేని వారు, పోలింగ్ బూత్‌కు రాలేని వారు, బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే వారు సదరన్ ద్వారా పొందిన పీహెచ్‌సీ సర్టిఫికెట్ విధిగా జత చేయాలన్నారు. బీఎల్ఓల పనితీరును అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మొత్తం పోలింగ్ బూత్‌లను, సిబ్బందితో కలసి పరిశీలించాలని ఎమ్మార్వో లక్ష్మణ్ బాబును ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, మల్లంపేట సర్పంచ్ బాపురెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభు, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య ఉప సర్పంచ్ ఎల్లప్ప, యువకులు ఉన్నారు.

### సూపర్‌వైజర్ సస్పెన్షన్

పాపన్నపేట మండల తహశీల్దార్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్, ఎన్నికల సూపర్‌వైజర్ రాధాక్రిష్ణ విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేశారు. గ్రామంలోచనిపోయిన వారి పేర్లను ఓటర్ లిస్టులో తొలగించే పద్ధతి నిబంధనల ప్రకారం చేయనందుకు, బీఎల్‌వోలను సమన్వయం చేయడంలో విఫలమైనందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.

# మెదక్‌లో దొరకేం పని

- మంత్రి హరీశ్ రావు శనిలా దాపురించిండు
- కాంగ్రెస్ నేతలను కొనుగోలు చేస్తుండు
- పోలీసు వాహనాల్లో డబ్బులను తరలిస్తుండ్రు
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు





**నవతెలంగాణ-మెదక్**

మెదక్‌లో దొరకేం పని ఉందని, పొద్దున లేస్తే కాంగ్రెస్ నేతలను ఇళ్లల్లోకి వెళ్ళి కొనుగోలు చేస్తుండని మంత్రి హరీశ్ రావుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్స్‌లో కాంగ్రెస్ మెదక్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైనంపల్లి హన్మంతరావు, మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ రోహిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ.. 2018 నుంచి తెలంగాణలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని వాయిదాలు, కోర్టు కేసులకే పరిమితం చేశారని రెండు సార్లు పేపర్ లీక్ అయిందని విమర్శించారు.

గ్రూప్ 2 వాయిదా పడినందుకు ప్రవళిక అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలన్నీ ఓ బూటకమన్నారు. 45 రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి బాగోతం బయటపెడతామని హెచ్చరించారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే 310 జీఓ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సి 27 శాతం పెంచుతామన్నారు. కాంగ్రెస్ నేతలు క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని కోరారు. మెదక్ నియోజకవర్గానికి మంత్రి హరీశ్ రావు శనిలా దాపురించాడని, ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను తరలించారని విమర్శించారు. మెదక్ జిల్లా బ్రిటిష్ కాలంలోనే ఏర్పడిందని, తెలంగాణా ఏర్పడిన తరువాత కేవలం సిద్ధిపేటను మాత్రమే సాధించుకున్నారని తెలిపారు. ఇంకెంత కాలం మెదక్‌ను పీడిస్తావని, మెదక్‌ను వదిలే వరకు తరిమి తరిమి వెంటాడుతామన్నారు.

ఎన్నికల్లో గెలిచేందుకు పోలీస్ వాహనాల్లో డబ్బులను తరలిస్తున్నారని ఆరోపించారు. మెదక్ ప్రజలు పదేళ్ళ అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలు చేపడతామని పదేళ్లలో బీఆర్ఎస్ ఏం అభివృద్ధి చేశారని, తనకంటే ఒక్క శాతం అభివృద్ధి చేసినట్లు చూపిస్తే రాజకీయాలు వదిలేస్తామని సవాల్ చేశారు.

### క్లాస్ కాదు.. ఊర మాస్:

బీఆర్ఎస్ డబ్బుల సంచులు ఎక్కడ ఉన్నాయో అన్ని తెలుసని, కనిపించేంత క్లాస్ కాదని ఊర మాస్ అని సమయం వచ్చినప్పుడు చూపిస్తామని మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. మంత్రి హరీశ్ రావు పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, డబ్బుల సంచులతో కాంగ్రెస్ నేతలను కొంటున్నారన్నారు. పిడికిలి లేపి కొట్లాడే కార్యకర్తలు మా వైపు ఉంటే, బీఆర్ఎస్ వైపు పిడికిలిలో ఉన్న కార్యకర్తలు ఉన్నారన్నారు. రాజకీయ పదవులు లేకున్నా సోషల్ సర్వీస్ ద్వారా మెదక్ లో అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామాల్లో మైనంపల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని ప్రజలు చెప్తున్నారని, ఆ తరువాత ఏ నాయకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఎకరాలు కావాలనుకుంటే వేల ఎకరాలు ఉండేవని, ఆస్తులు సంపాదించాలని అనుకోలేదని తెలిపారు. సిద్దిపేటకు వేయి పడకలు, మెదక్‌లో 100 పడకల ఆసుపత్రి మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి పాలనకు స్వస్తి పలుకుతామన్నారు. మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. అందరి ఆశీర్వాదంతో మెదక్‌ను 20 ఏళ్ల అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని, పాత కాంగ్రెస్ నేతలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేందర్ గౌడ్, బొజ్జ పవన్, జీవన్ రావు, ప్రభాకర్ రెడ్డి, అనిల్, హఫీజ్, సుప్రభాత రావు, తాహెర్, లల్లు, శేఖర్, గంగ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం లేకుండా వేసిన బూత్ కమిటీలను రద్దు చేయాలి

- ప్రతాప్ రెడ్డి పెత్తనంలో మేం పని చేయలేం
- తిరిగి అందరి ఆమోదంతో బూత్ కమిటీలను వేయాలి
- అసంతృప్తి వ్యక్తం చేసిన సర్పంచులు

**నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్**

గ్రామాలలోని సర్పంచులు, నాయకులకు తెలుపకుండా వేసిన బూత్ కమిటీలను వెంటనే రద్దు చేయాలని, తిరిగి గ్రామాలలో అందరి సమక్షంలో బూత్ కమిటీలను వేయాలంటూ మండలంలోని సర్పంచులు, అసంతృప్తి నాయకులు పేర్కొన్నారు. అలాగే ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, నాయకులు పురం రవి ముదిరాజ్‌ల పెత్తనంలో తాము పనిచేయలేమని నాయకులు పేర్కొన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాంతో పార్టీ రాష్ట్ర నాయకులు రేఖల శేఖర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజుల ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు వివిధ కమిటీల అధ్యక్షులు కలిసి వేరే చోట సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎంపీటీసీ చైర్మెన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, నాయకులు పురం రవి ముదిరాజులు ఎవరికి సమాచారం లేకుండా బూత్ కమిటీలను ఎలా వేశారంటూ వారి పెత్తనంలో మేము పనిచేయలేమని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్నామని అలాంటి తమకు పార్టీ నుంచి వచ్చే సంక్షేమ పథకాలను కూడా ఇప్పించడం లేదంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. బూత్ కమిటీలను ఏర్పాటు చేయడంలో కనీసం మండల పార్టీ అధ్యక్షునికి కూడా సమాచారం ఇవ్వకపోవడమేంటని, అలాంటి కమిటీలను రద్దుచేసి తిరిగి కమిటీలను వేయాలని, సర్పంచులు అసంతృప్తి నాయకులు పేర్కొన్నారు. దాంతో రాష్ట్ర నాయకులు శేఖర్ గౌడ్ సమావేశానికి వస్తున్న వంటేరు ప్రతాప్ రెడ్డికి బూత్ కమిటీల రద్దు విషయం ఫోన్లో వివరించి అనంతరం ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులు గ్రామ కమిటీ అధ్యక్షులు ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు భారీ మెజార్టీ తీసుకురావడమే అందరి లక్ష్యం

- పార్టీ కోసం కష్టపడి పని చేయాలి
- రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



**నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్**

ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని, అలాగే ప్రతి ఒక్కరి లక్ష్యం సీఎం కేసీఆర్‌ను మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో పనిచేయాలని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మెన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి సూచించారు. శనివారం మనోహరాబాద్ మండల బూత్ కమిటీ సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీకి కనీసం అభ్యర్థి కూడా లేడని, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సీఎం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలందరూ గుర్తిస్తున్నారన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని, ఇక నుంచి మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఇప్పటివరకు వేసిన బూత్ కమిటీలను కాకుండా తిరిగి కమిటీలను వేసుకోవాలని ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల పిఎసిఎస్ చైర్మెన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు భాషా బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మైపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, పొట్టోల్ల వెంకట్ గౌడ్, నాయకులు శివగోని పెంటా గౌడ్, సర్పంచులు మాధవరెడ్డి, అర్జున్, పల్లపు రమేష్, నాగభూషణం, మంగ్య నాయక్, నరేష్ ముదిరాజు, నాయకులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబురాలు



**నవతెలంగాణ-నార్సింగి**

మండల వ్యాప్తంగా బతుకమ్మ పండుగ సంబరాలు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యాయి. బతుకమ్మ పండుగ అంటే మహిళలందరూ సంతోషంగా, ప్రకృతితో మమేకమై నిర్వహించుకునే అద్భుతమైన పండుగ బతుకమ్మ పండుగ. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పువ్వులను పూజించే ఆచారాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగను చేస్తారు. హిందూ పంచాంగం ప్రకారం ప్రతి సంవత్సరం అశ్వీయుజ మాసంలో శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్య తిథి నుంచి ఎంగిలి పూల బతుకమ్మ పండుగ ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. పంట పొలాల నుంచి గునుగు పువ్వు, తంగేడు పువ్వు ఇలా రకరకాల రంగు రంగుల పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు. బతుకమ్మ వేడుకల్లో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, 2వ రోజు అటుకుల బతుకమ్మ, 3వ రోజు ముద్దపప్పు బతుకమ్మ, 4వ రోజు నానే బియ్యం బతుకమ్మ, 5వ రోజున అట్ల బతుకమ్మ, 6వ రోజు అలిగిన బతుకమ్మ 7వ రోజు వేపకాయల బతుకమ్మ, 8వ రోజున వెన్నముద్దల బతుకమ్మ, 9వ రోజు సద్దుల బతుకమ్మతో ఈ పండుగ ముగుస్తుంది. ముగింపు రోజున సాధారణ రోజుల కంటే ఎక్కువ మంది బతుకమ్మ తయారు చేసి నీళ్లలో నిమజ్జనం చేస్తారు. ఇదే రోజున నవరాత్రుల్లో భాగంగా దుర్గాష్టమి పండుగను నిర్వహిస్తారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళల్లో సంతోషం వెల్లివిరిసింది.

**నవతెలంగాణ-నిజాంపేట**

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో శనివారం ఎంగిలి బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దేశెట్టి సిద్ద రాములు మాట్లాడుతూ ప్రకృతిలోని పువ్వులను ఆరాధించే ఏకైక సంస్కృతి తెలంగాణలో ఉన్నదన్నారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కూడా కేటాయించడం జరుగుతుందన్నారు మహిళలు బతుకమ్మ ఆటపాటలతో ఆడుతూ సాయంత్రం చెరువులలో నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత రాజ్, ఉప సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

**నవతెలంగాణ -వెల్దుర్తి**

పూర్వకాలం నుంచి వస్తున్న ధర్మ ప్రకారం పెద్దల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని పూర్వీకుల పేరిట ధనధాన్యాన్ని దానం చేశారు. శనివారం ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలాలు ఉన్న గ్రామ గ్రామాన గ్రామ







పురోహితులకు అందజేశారు. పెద్దలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం సాయంకాలం ప్రధాన కూడలిల వద్ద పెద్ద బతుకమ్మ పేర్చి చిన్న పెద్ద మహిళలు పట్టు వస్త్రాలు ధరించి కోలాటం వేసి గౌరమ్మ పాటలతో ఉర్రూతలూగించారు.

## ఎన్నికల సమయంలో మద్య నిషేధం విధించాలి



**నవతెలంగాణ-నిజాంపేట**

నిజాయితీగా ఎన్నికలు జరగాలంటే మద్యాన్ని ఎన్నికలకు 15 రోజుల ముందు పూర్తిగా నిషేధించాలని పోలీసు వ్యవస్థను పూర్తిగా బదిలీలు చేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. పూర్తిగా మద్యాన్ని నిషేధించినప్పుడే మనిషి నిష్కల్మశంగా ఉంటాడు. అప్పుడు ఎవరికి ఓటు వేయాలో మంచిగా ఆలోచించుకొని సరియైన నాయకున్ని ఎన్నుకుంటాడు. కరోనా సమయంలో మద్యాన్ని ఉత్పత్తి చేయడం నిలిపివేశారు. అదే మాదిరిగా ఇప్పుడు మద్యం ఉత్పత్తిని బందు చేసినట్లయితే ప్రజలు ఓటు హక్కు ప్రశాంతంగా వినియోగించు కుంటారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో మద్యాన్ని అధికంగా ఉత్పత్తి చేస్తున్నాయి. మద్యం ఏరులై పారే ప్రమాదం ఉందని మద్యాన్ని అభ్యర్థులు ఓటర్ మహాశయులకు ఆశ చూపి మద్యాన్ని పంచుతారు. మద్యం మత్తులో మనిషి ఎవరికి ఓటేస్తాడో ఏమో తెలియని పరిస్థితి. మద్య నిషేధాన్ని ఉత్పత్తి చేసే విధానాన్ని బందు చేసేలా ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకున్నట్లయితే, ఇటు ఓటర్లకు అటు అభ్యర్థులకు ఎంతో మేలు చేసిన వారవుతారు. ఎన్నికల కమిషనర్ ఇంకా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భవిష్యత్తులో సామాన్యుడు ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని మండల ప్రజలు వాపోతున్నారు. డబ్బులు మద్యాన్ని ఓటర్లకు పంచే విధానాన్ని పకడ్బందీగా రద్దు చేసేలా తగు జాగ్రత్తలు తీసుకుని అన్ని రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పే విధంగా సంస్కరణలు రూపొందించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

## నేడు పద్మశాలి సంఘం సమావేశం



**నవతెలంగాణ-మర్కుక్**

పద్మశాలి సంఘం మర్కుక్ మండల సమావేశం నేడు నిర్వహించడం జరుగుతుందని ఆసంఘం సీనియర్ నాయకులు ఎంపీటీసీ గోలి నరేందర్ తెలిపారు. మర్కుక్ మండల కేంద్రంలో గల రంగనాయక స్వామి ఆలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల పద్మశాలి సంఘం నాయకులు తమ విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా మద్దూరి జన్మదిన వేడుకలు



**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ మండలం బయ్యారం గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత మద్దూరు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన ఇంటిలో స్థానిక జడ్పిటిసి పంగ మల్లేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, సంతోషిని రామచంద్రచారి, నాయకులు హైదర్ ఇక్బాల్, నవతెలంగాణ పాత్రికేయుడు నాయిని యాదగిరిలు ఆయనను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బయ్యారం గ్రామంలో గ్రామ యువత నాయకులు కార్యకర్తలు అభిమానులు కేకు కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## గురుకుల పాఠశాలలో రెండో రోజు హెూరాహెూరీగా సాగిన క్రీడలు



**నవ తెలంగాణ- మిరుదొడ్డి**

మిరుదొడ్డి మండలం అల్వాల బాలుర తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల జోనల్ మీట్ -9 క్రీడలు రెండోరోజు శనివారం హెూరా హెూరీగా సాగాయి. అండర్-14, అండర్-17, అండర్ 19, విభాగాల్లో 12 గురుకులాల 1020 విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్బాల్, ఫుట్బాల్, చెస్, క్యారం, రన్నింగ్, షార్ట్ పుట్ తదితర విభాగాల్లో క్రీడలు పూర్తయ్యాయి. అల్వాల్, కామారెడ్డి జిల్లా భికునూర్ గురుకులాల విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటేందుకు పోటాపోటీగా ఆడుతూ విజేతలుగా నిలిచేందుకు తీవ్రంగా శ్రమించారు. క్వాటర్, సెమీ ఫైనల్ ఆటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఆదివారం జరిగే పోటీల్లో తలపడనున్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడల నిర్వహణను ఆర్సిఓ నిర్మల, ప్రిన్సిపల్ దనలక్ష్మి, వాసుదేవా చారి, చలపతి, కల్పన, ఉషా కిరణ్ తదితరులు పర్యవేక్షించారు.

## 23వ తేదినే విజయదశమి



**నవతెలంగాణ-మిరుదొడ్డి**

విజయదశమి పండుగను అక్టోబర్ 23వ తేదీ సోమవారం రోజున చేసుకోవడం శాస్త్రోపనీయం ప్రకారం ఎంతో ఉత్తమమని గ్రామ పురోహితులు వితల రాజపున్నయ్య శర్మ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం రోజున దశమికి ముఖ్య గౌణకాల వ్యాప్తి లేనందున సోమవారం శ్రవణ నక్షత్ర దశమి స్వర్శమగుటవలన నక్షత్రాలు ఉదయించు సమయం విజయదశమి వ్యాప్తి ఉన్నందున సోమవారం రోజున ప్రజలు విజయదశమి పండుగను చేసుకోవడం శాస్త్రసమ్మతమని పురోహితులు వితల రాజపున్నయ్య శర్మ పేర్కొన్నారు. 22వ తేదీ ఆదివారం సద్దుల బతుకమ్మ చేసుకొని, 23వ తేదీన దసరా పండుగను చేసుకోవాలని సూచించారు.

## దళితుల నోట్లో మట్టికొడుతున్న ఎమ్మెల్యే



**నవ తెలంగాణ- దుబ్బాక**

ఎమ్మెల్యే రఘునందన్ రావు దళితులు అంటే తనకెంతో గౌరవమని అంటూనే వారి నోట్లో మట్టి కొడుతున్నారని దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ యూత్ అధ్యక్షుడు దొమ్మాట భూపాల్ మండిపడ్డారు. శనివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని మెదక్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏమి ఎరగనట్టు దళితులపై ఎమ్మెల్యే కపట ప్రేమ చూపుతున్నారన్నారు. దళిత, మైనార్టీల వ్యతిరేకి రఘునందన్ రావు అని వారు పేర్కొన్నారు. దళిత బంధు, గృహలక్ష్మి, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలను లబ్ధిదారులకు దక్కకుండా అడ్డుకుంటున్నారు. మిస్టర్ ఎమ్మెల్యే. దళితులపై నీకు కన్నెర ఎందుకు" అని వారు నిలదీశారు. ఎన్నికలకు ముందే ప్రొసీడింగ్ కాపీలు వచ్చిన వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా దుబ్బాక ఎమ్మెల్యే అడ్డుకోవడం సరికాదన్నారు. దళితుల పట్ల ఆయనకు ఉన్న వివక్షకు ఇదే నిదర్శనమన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఎమ్మెల్యే రఘునందన్ రావు చేసిన ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకొని దుబ్బాక ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుబంధు మండల కన్వీనర్ వంగ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ దుబ్బాక మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, కౌన్సిలర్లు దివిటి కనకయ్య, దుబ్బాక బాలకృష్ణ గౌడ్, బత్తుల స్వామి, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూమిరెడ్డి, కొత్త కిషన్ రెడ్డి, రొట్టె రాజమౌళి, అధికం బాలకిషన్ గౌడ్,బండి రాజు, లొంక లచ్చయ్య,దేవుని చంద్రయ్య,రవి,రాంప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, తుమ్మ భాస్కర్, పడాల నరేష్, పోసరిగళ్ళ రాజు, ఇస్తారిగళ్ళ చరణ్ తేజ, పలువురు పాల్గొన్నారు.

## పదేళ్లయినా హుస్నాబాద్‌లో ఏ మార్పు లేదు



**నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్**

హుస్నాబాద్‌లో ఎమ్మెల్యే సతీష్ కుమార్ గెలిచి పదేళ్లయినా హుస్నాబాద్ అభివృద్ధిలో ఎలాంటి మార్పు కనబడటం లేదని బీజేపీ నియోజకవర్గ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఆరోపించారు. శనివారం హుస్నాబాద్ లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గౌరవెల్లి భూనిర్వాసితులు హక్కుల కోసం పోరాడితే అక్రమ కేసులు పెట్టారన్నారు. నిర్వాసితులు కడుపుమంటతో ఉంటే బీఆర్ఎస్ నాయకులు గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై గొర్రెలు కోసుకొని పండుగలు చేశారన్నారు. నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసి సీఎం కేసీఆర్ హుస్నాబాద్‌లో అడుగు పెట్టాలన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్లో కాంట్రాక్టర్ డబ్బుల కోసం నీటిని వదిలారన్నారు. ధన, అధికార బలంతో చేస్తున్న అక్రమాలను ప్రజలు చూస్తున్నారన్నారు. హుస్నాబాద్‌లో బీజేపీ అభ్యర్థి విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, దొడ్డి శ్రీనివాస్, రామంచ మహేందర్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, గొల్లపల్లి వీరాచారి పాల్గొన్నారు.

## సొంత గూటికి బీఆర్ఎస్ నాయకులు

**నవతెలంగాణ - రాయపోల్**

ప్రలోభాలకు తలొగ్గి బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపి పార్టీలో చేరిన యువకులు తిరిగి బీఆర్ఎస్ పార్టీ సొంతగూటికి చేరుకున్నారని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన 15 మంది యువకులకు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి పథకాలలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో గతంలో జరిగిన ఉప ఎన్నికలలో గెలిచిన బీజేపి ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని కేంద్ర నిధులు తీసుకువచ్చి ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని, రైతులకు, నిరుద్యోగులకు ఎన్నో హామీలను ఇచ్చి అతి తక్కువ ఓట్ల మెజారిటీతో గెలుపొందారన్నారు. గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో ఏ ఒక్క పని చేయలేదని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే మాయమాటలు చెప్పి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అలాంటి వారి మాటల నమ్మి మరోసారి మోసపోవడానికి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా లేరని, రాబోయే ఎన్నికలలో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, రైతుబంధు మండల అధ్యక్షులు మున్న, వడ్డేపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు పెయింటర్ రవి, సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్, జగపతి రెడ్డి, అయ్యగల్ల రవి, చిరంజీవి, నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుబ్బాక ఎమ్మెల్యే బరిలో మల్లేష్ యాదవ్



**నవతెలంగాణ-దుబ్బాక**

దుబ్బాక ఎమ్మెల్యే బరిలో సల్కం మల్లేష్ యాదవ్ నిలుస్తున్నట్లు సమాచారం. యువకుడు, బీసీ ముద్దుబిడ్డ, సేవా దృక్పథం కలిగిన వ్యక్తి మల్లేష్ యాదవ్. దుబ్బాక ప్రాంతంలోని పలు ఆలయాలకు విరాళం,పేదలకు ఆర్థిక సహాయం, అన్నదానం వంటి పలు సేవా కార్యక్రమాలతో సల్కం మల్లేష్ యాదవ్ దుబ్బాక ప్రజలకు సుపరిచితుడు. మండల పరిధిలోని పోతారం స్వగ్రామం. 2020 కరోనా లాక్‌డౌన్ కాలంలో పోతారం గ్రామస్తులకు తన సొంత ఖర్చులతో కూరగాయలు, నిత్యావసరాలు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశాడు. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా వేసవి కాలంలో పోతారంతో పాటు చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేస్తున్నాడు. ఏడాది పాటు ఎంపీయుపిఎస్ పాఠశాలలో విద్యా వాలంటీర్లను నియమించి వారికి వేతనాలను చెల్లించాడు. స్వంత డబ్బులతో మహంకాళి దేవాలయాన్ని నిర్మించాడు.గతేడాది వేసవిలో పోతారం గ్రామస్తులకు వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి దుబ్బాకలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు. 2009 లో రేకులకుంట మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్‌గా పనిచేశారు. 2020 లో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపి నుంచి పోటీ చేసిన రఘునందన్ రావుకు మద్దతు తెలిపిన మల్లేష్ యాదవ్ రఘునందన్ రావు విజయానికి తనవంతు కృషి చేశాడు. 2023 అక్టోబర్ 1న బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సమక్షంలో బీఎస్పిలో చేరారు. పార్టీ టికెట్ వస్తే ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేగా బరిలో ఉంటాడని, దుబ్బాక ప్రజలు ఆశీర్వదిస్తే సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సల్కం మల్లేష్ యాదవ్ అనుచరులు తెలిపారు.

# ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్

**నవతెలంగాణ-సిద్దిపేట**

గ్రూపు-2 పరీక్ష వాయిదా పడిందని మనస్థాపానికి గురై హైదరాబాద్ అశోక్ నగర్‌లో ప్రైవేట్ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకొని చనిపోయిన నిరుద్యోగ విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్‌లు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత సంవత్సరం కాలంలో ఇది 8వ నిరుద్యోగుల ఆత్మహత్య అని, సరైన ప్రణాళిక లేకుండా రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ వ్యవరిస్తుందని, దానికితోడు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించకపోవడమేనన్నారు. మళ్ళీ సమయాన్ని పొడిగించడమంటే పేద విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవన్నారు. కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు చెల్లించి, హస్టళ్లలో వేలాది రూపాయాలు ఖర్చు చేస్తూ నిరుద్యోగులు చదువుకుంటున్నారన్నారు. వారి ఇబ్బందులు ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అధికారం కోసం ఇస్తున్న ప్రాధాన్యత కనీసం విద్యార్థి, నిరుద్యోగులకు భరోసా కల్పించడంలో చూపడం లేదన్నారు. పోన్నాల ఇంటికెళ్లిన కేటీఆర్ , విద్యార్థి మరణిస్తే కనీసం వారి కుటుంబానికి భరోసా ఇచ్చే సమయం లేదా అని ప్రశ్నించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరుద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. నిరుద్యోగులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ నిలుస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు.



# దళితుల వ్యతిరేకి రఘునందన్





**నవతెలంగాణ-తొగుట**

తాము చేయరు, ఇతరులను చేయనియ్యరన్నట్లు దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మరోసారి తన నిజ స్వరూపం చాటుకున్నారని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలుపుదల చేయాలని ఎన్నికల కమీషన్‌కు ఎమ్మెల్యే రఘునందన్‌రావు వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి పేదల పట్ల వారికున్న వ్యతిరేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపే పథకం "దళిత బంధు' బీసీ బంధులను నిలిపి వేయాలని ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. పేదోళ్ల సొంతింటి కల నెరవేర్చే గృహలక్ష్మి పథకాన్ని కూడా నిలిపివేయాలని పేదొల్ల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. కేంద్రం నుంచి తాను రూపాయి తెచ్చింది లేదు కానీ కేసీఆర్ సర్కార్ అందించే పథకాలను అడ్డుకోవడం వల్ల తన బుద్ధిని చూపారన్నారు. ఎన్నికల కోడ్ కన్నా ముందే ఎంపికైన పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా దుబ్బాక నియోజక వర్గ ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. దుబ్బాక ప్రజలకు క్షమాపణ చెప్పి, ఫిర్యాదు వెనక్కి తీసుకునే వరకు ఎక్కడికక్కడ రఘునందన్ రావును అడ్డుకోవాలని కోరారు.

**నవతెలంగాణ-మిరుదొడ్డి**

రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయాలని ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దళితబంధు, గృహలక్ష్మి బీసీబంధు పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేయొద్దు అంటూ మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత బంధు ఇవ్వాలని మాట్లాడిన రఘునందన్ రావు ఇప్పుడు ద్వంధ వైఖరిని అవలంభించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటుతో దుబ్బాక నియోజకవర్గం ప్రజలు బీజేపీ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలు, బీఆర్ఎస్ నాయకులు లింగం, సత్యనారాయణ, బైరయ్య మల్లయ్య, శేఖర్, సుంకరి లింగం పలువురు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-సిద్దిపేట**

దళితుల అభ్యున్నతి, ఆర్థిక ఎదుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు అమలుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అడ్డుపడ్డారని, దళితుల వ్యతిరేకి అని డిడబ్ల్యూజేఎస్ జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం ఆరోపించారు. ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు ద్వారా దళిత బంధు పథకాన్ని నిలిపివేశారన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి, జనార్ధన్ కోశాధికారి చంద్రం, నాయకులు బాబురావు , రంగరాజు, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలు ప్రారంభం







**నవతెలంగాణ-గజ్వేల్**

శనివారంతో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. సద్దుల బతుకమ్మను ఈ నెల 22న వరకు నిర్వహిస్తారు. అప్పటివరకు మహిళలు అన్ని గ్రామాల్లో పూల పండుగను చేసుకుంటారు. పాఠశాలలకు సెలవు రావడంతో చిన్నారులు, పెద్దలు పూల పండుగలో నిమగ్నమై ఉంటారు. ఇందులో భాగంగానే గజ్వేల్ ప్రాంతంలో శనివారం బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. మహిళలు, చిన్నారులు పట్టు వస్త్రాల అలంకరణతో చెరువు కట్టలకు బతుకమ్మలను తీసుకెళ్లి అక్కడ నిమజ్జనం చేస్తుంటారు. కొన్ని ప్రాంతంలో ఏడు రోజులకు సద్దుల బతుకమ్మ చేస్తుండగా మరికొన్ని ప్రాంతంలో 9 రోజులకు సద్దుల బతుకమ్మ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ మరుసటి రోజు దసరా పండుగలు నిర్వహిస్తుంటారు.

**నవతెలంగాణ-నంగునూరు**

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో శనివారం బతుకమ్మ పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎంగిలి బతుకమ్మతో మొదలై ఉత్సవాల ముగింపు రోజైన సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు మహిళలు ఆటపాటలతో గడుపుతారు. వేడుకల్లో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-సిద్దిపేట**

తెలంగాణలోని ఆడపడుచులకు అతి ముఖ్యమైన బతుకమ్మ పండుగ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ లయబద్ధంగా పాటలు పాడుతూ, గౌరమ్మలను తయారు చేసి బతుకమ్మలో ఉంచి ఆటలు ఆడుతారు. అనంతరం చెరువులలో నిమజ్జనం చేస్తారు. మహిళలు అక్కడికి తెచ్చుకున్న ప్రసాదాలను ఒకరికొకరు పంచుకుంటారు. చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలోని మున్సిపల్ అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు.

# దుబ్బాకలో వేడెక్కిన రాజకీయం

- ప్రచారాన్ని షురూ చేసిన ఎమ్మెల్యే



**నవతెలంగాణ-దుబ్బాక**

ఎన్నికల షెడ్యూల్ వెలవడ్డ నాటి నుంచే దుబ్బాకలో రాజకీయం హీటెక్కింది. బీఆర్ఎస్, బీజేపి, కాంగ్రెస్ నాయకులు బిజీ బిజీ అయ్యారు. దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు నియోజకవర్గంలో అందరికంటే ముందే ఎన్నికల ప్రచారాన్ని షురూ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన వైఫల్యాలను ఎండగడుతూనే మరోపక్క దుబ్బాకకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. 2020 ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన మూడేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని ప్రచారం చేస్తున్నారు. దుబ్బాక మరింత అభివృద్ధి జరగాలంటే తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

### సమావేశాలు, చేరికలతో ఎంపీ బిజీ.....

మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి బీజేపి, కాంగ్రెస్ పార్టీల నాయకులను బీఆర్ఎస్‌లోకి చేర్చుకుంటూ బిజీగా ఉన్నారు. నియోజకవర్గం తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ వారి సాధక బాధలను తెలుసుకుంటున్నారు. ఓవైపు సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దుబ్బాక అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూనే మరోవైపు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, కేంద్రం నుంచి నిధుల్ని రాబట్టడంలో విఫలమైన తీరుపై ఎప్పటికప్పుడు విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఎండగడుతున్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్‌ను నింపుతున్నారు.

### సైలెంట్ మోడ్‌లో కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న ముగ్గురు నాయకులు టికెట్లపై స్పష్టమైన హామీ రాకపోవడంతో ఎటు తోచని స్థితిలో ఉన్నారు. కాంగ్రెస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కత్తి కార్తీక గౌడ్, పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డిలు మొన్నటి వరకు ప్రచారంలో స్పీడ్ పెంచి తమకంటే తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకున్నారు. హైదరాబాద్, ఢిల్లీ లలో అధిష్టానం పెద్దలను కలుస్తూ ఎవరికి వారే పార్టీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఈ ముగ్గురు లీడర్లు సైలెంట్ మోడ్‌లో ఉన్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. అధిష్టానం దుబ్బాక టికెట్‌ను ఎవరికి ఇస్తుందోనన్న టెన్షన్ కాంగ్రెస్ శ్రేణుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. దుబ్బాక కాంగ్రెస్ టికెట్ ఎవరికి వస్తుందో మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

# నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఉత్సవాలకు ముస్తాబైన సరస్వతి క్షేత్రం
- విద్యుత్ కాంతుల్లో సరస్వతీ ఆలయం
- నేటి నుండి 9 రోజులపాటు ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొననున్న భక్తులు



**నవతెలంగాణ-వర్గల్**

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వర్గల్ శ్రీ విద్య సరస్వతి ఆలయంలో నేటి నుంచి 9 రోజులపాటూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. నవరాత్రులకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే రెండో బాసరగా పేరు పొందిన ఆలయం. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయంను రంగు రంగుల విద్యుత్ కాంతులతో అలంకరించారు. భక్తుల సౌకర్యాల నిమిత్తం అన్ని ఏర్పాట్లు చేశారు. వర్గల్ క్షేత్రం హైదరాబాద్ జంటనగరాలకు సమీపంలో ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 23 వరకు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం గణపతి పూజ, పుణ్య హవనం, మహాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. 20వ తేదీ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ నిర్వహించనున్నారు. 22వ తేదీ ఆదివారం మహర్నవమి సందర్భంలో అష్టోత్తరశత కలశ అభిషేకం నిర్వహిస్తారు. 23వ తేదీన విజయదశమి సందర్భంగా దివ్య దర్శనం ఉంటుంది . ఆ రోజు అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిస్తారు. ఇదే రోజున శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అలంకరణ, లక్ష నామార్చన, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ కోరారు.

# అన్నివిధాలుగా అభివృద్ధి చేశారు..అండగా ఉంటాం



- గాగీల్లపూర్ గ్రామ ఆశీర్వాద సభలో ఎమ్మెల్యేకు గ్రామస్తుల అభినందనలు

**నవతెలంగాణ-బెజ్జంకి**

తమకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా..ముంపు గ్రామమైన తమ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే రసమయన్నదేనని, అభివృద్ధికి అండగా ఉంటామని, మూడోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నుకుంటామని గాగీల్లపూర్ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే రసమయికి గ్రామస్తులు భరోసానిచ్చారు. శనివారం మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామంలో సర్పంచ్ అన్నాడి సత్యనారాయణ రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆశీర్వాద సభకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హజరవ్వగా గ్రామ మహిళలు బతుకమ్మలతో, బీఆర్ఎస్ కార్యకర్తలు బాణసంచాలు కాల్చుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రసమయి మాట్లాడారు. మానకొండూర్ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో రెండు ధపాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గంలోని మండలాల్లోని గ్రామాల్లో ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేర్చానన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశానని రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ మరోసారి అత్యధిక మెజార్టీతో ఓట్లేసి ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే రసమయికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కవిత, ఏఎంసీ చైర్మన్ చంద్రకళ,సర్పంచ్ అన్నాడి సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ కొమిరే మల్లేశం, ఉప సర్పంచ్ బామండ్ల తిరుమల, మండల, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు హజరయ్యారు.

# టీఎస్‌పీఎస్‌సీ బోర్డు తక్షణమే ప్రక్షాళన చేయాలి



**నవతెలంగాణ-సిద్దిపేట**

టీఎస్‌పీఎస్‌సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్, ప్రజాఫ్రంట్ నాయకుడు సత్తయ్యలు డిమాండ్ చేశారు. సడక్ బంద్‌లో భాగంగా బీఎస్‌పీ, పీడీఎస్‌యూ అధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా నుంచి రంగాధంపల్లి అమర వీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లి, జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. త్రి టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని నాయకులను అక్రమ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్, ప్రజాఫ్రంట్ నాయకుడు సత్తయ్యలు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ బోర్డ్‌ను వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్లనే హైదరాబాద్ చిక్కడపల్లి హాస్టల్‌లో ప్రవళిక అనే నిరుద్యోగ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం హత్యేనని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులు దౌర్భాగ్యమైన స్థితికి నెట్టబడ్డారని, అన్ని పోటీ పరీక్షలను లీక్ చేసి, వాయిదాలు వేసి నిరుద్యోగులను మానసికంగా హింసిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే బోర్డ్ చైర్మన్ జనార్ధన్ రెడ్డిని విధుల నుంచి తొలగించిన తర్వాతనే అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వన్ టైమ్ రిజిస్టర్ చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రూ.3 లక్షల నష్టరిహారం చెల్లించాలని, అన్ని రకాల ఉద్యోగ ఖాళీలను గుర్తించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరి ఉమేష్, పీడీఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్, బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి అశోక్, నేతలు బాబు, వెంకటేశ్వర్లు, మల్లేశం , భాను, ప్రశాంత్, మహేష్, పీడీఎస్‌యు నాయకులు హిమవంత్, సాయి కార్తీక్, వెంకట్, లక్ష్మన్, హరి కిరణ్, వేణు, భాను , రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞాపూర్‌లో మహాలయ అమావాస్య అన్నదానం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా కీర్తి శేషులు గంగిశెట్టి రాజేశం జ్ఞాపకార్థం వారి కుమారులు దాదాపు 300 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌సీ సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అన్నదానం మహాదానమన్నారు. మహాలయ అమావాస్య పురస్కరించుకుని గంగిశెట్టి వెంకటేష్ సోదరుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొండ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గోలి సంతోష్, లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్, సూర ఆంజనేయులు, చందా నాగభూషణం, తోటబిక్షపతి, శివకుమార్, దోమకొండ సతీశ్, గంగిశెట్టివెంకటేష్, బాలయ్య, ఆంజనేయులు, భాస్కర్, ఉమేష్, సంతోష్, నరేష్, కైలాస ప్రశాంత్, కుమార్, గంగిశెట్టి పోచమ్మ కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన గంగాధరి నర్సింలు (26) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. నర్సింలు శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగుతున్నానని రాయపోల్‌లో చింత చెట్టు వద్ద ఉన్నానని తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకొని నర్సింలును 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గజ్వేల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన తర్వాత నర్సింలు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

# ముస్తాబైన హుస్నాబాద్

- సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఏర్పాట్లు
- లక్ష మంది జనసమీకరణకు కసరత్తు
- గులాబీమయమైన హుస్నాబాద్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్ పార్టీ ఉందనే సంకేతాలు ఇవ్వాలని ఆ పార్టీ భావిస్తోంది. హుస్నాబాద్‌లో ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అభ్యర్థిత్వాన్ని ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఏ పార్టీకి లేని బలం, బలగం బీఆర్ఎస్ పార్టీకి ఉన్నాయని, లక్ష యాభైవేల మంది వివిధ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారులు తమవైపు ఉన్నారనే ధీమాతో బీఆర్ఎస్ నేతలున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్ గడ్డ నుంచే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరు కానున్నారు. సీఎం సభకు హుస్నాబాద్ ముస్తాబైంది. గులాబీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, కటౌట్లతో పట్టణమంతా గులాబీమయంగా మారింది. సీఎం సభకు లక్ష మందిని సమీకరించేందుకు ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, మంత్రి హరీశ్‌రావు సర్వం సిద్ధం చేశారు.

### కేసీఆర్ సభకు ఏర్పాట్లు

సీఎం కేసీఆర్ సభకు హుస్నాబాద్ పట్టణంలోని సబ్ స్టేషన్ పక్కన ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ , మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఏర్పాట్లను చేపట్టారు. ఇప్పటికే మంత్రి హరీష్ రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీష్ కుమార్‌తో కలిసి హుస్నాబాద్‌లోని బహిరంగ సభ స్థల ఏర్పాట్లపై చర్చించారు. హెలిప్యాడ్ , పార్కింగ్ ప్లేస్ లు సభ మైదానం ఏర్పాట్లను నిరంతరం ఎమ్మెల్యే సతీష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. హుస్నాబాద్ లో ఎక్కడ చూసినా గులాబీ సైన్యాలు కదం తొక్కుతున్నాయి. గులాబీ వర్ణాన్ని సంతరించుకుంటోంది. సీఎం కేసీఆర్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు స్థానిక బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. డప్పు చప్పుళ్ళు, కోలాటాలు, బతుకమ్మలు, బోనాలు, నృత్యాలతో సందడి చేస్తూ అన్ని గ్రామాల నుంచి జనం కదిలేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా అన్ని గ్రామాల నుంచి యువత పెద్ద ఎత్తున కదిలేలా యువనేత, ఎమ్మెల్యే యువనేత ఇంద్రనీల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా మండలాల నుంచి బైక్ ర్యాలీలు నిర్వహించి సభకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



### సభకు లక్ష మంది తరలింపునకు ప్రణాళిక

అత్యంత చారిత్రాత్మకంగా జరగనున్న ఈ సభకు పెద్ద ఎత్తున జనసమీకరణ చేసి విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హుస్నాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు లక్షమందిని తరలించేలా ఎమ్మెల్యే సతీష్ కుమార్ ప్రణాళికలు సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించి పార్టీ ముఖ్య నేతల వద్ద మంచి పేరు సంపాదించుకొనే అవకాశాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని స్థానిక గులాబీ శ్రేణులు భావిస్తున్నారు. గ్రామగ్రామాన ఇంటింటికి తిరుగుతూ బొట్టు పెడుతూ బహిరంగ సభకు రావాలని నాయకులు కోరుతున్నారు. ఏదిఏమైనా కేసీఆర్ సభకు లక్షకుపైగా మందిని తరలించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకులు జనని తరలించేలా చర్యలు చేపడుతున్నారు.

### పార్కింగ్ ఏర్పాట్లు

హుస్నాబాద్ పట్టణంలోని సబ్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన కేసీఆర్ సభకు వెళ్లే వాహనాలు సేయింట్ జోసెఫ్ పాఠశాల ఎదురుగా గ్రాండ్, కరీంనగర్ రోడ్‌లో విజయ డైరీ పక్కన, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల పక్కన వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేశారు.



### బహిరంగ సభ విజయవంతం చేయాలి

0హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభను అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే విడుదల సతీష్ కుమార్ కోరారు. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే హెలిప్యాడ్ నిర్మాణం పూర్తయింది. సభాస్థలి వేదిక పనులను ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గం సీఎం కేసీఆర్ లక్కీ నియోజకవర్గం అని గతంలో 2014, 2018 రెండుసార్లు హుస్నాబాద్ నుంచి కేసీఆర్ ఎన్నికల ప్రచారాన్ని బహిరంగ సభ ద్వారా ప్రారంభించారని గుర్తు చేశారు. మూడోసారి హ్యాట్రిక్ దిశగా దూసుకుపోతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభంజనం సృష్టించబోతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రజలందరి అందరి ఆశీర్వాదంతో మళ్లీ నేను గెలవబోతున్నానని ధీమాను వ్యక్తం చేశారు. బహిరంగ సభ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. మహిళలకు, వికలాంగులకు ప్రత్యేకమైన గాలరీలు ఏర్పాటు చేశామని, సభలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## ఆశీర్వాద సభ నిర్వహించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

- నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించిన బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-కోహెడ



నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేడు హుస్నాబాద్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాద సభ నిర్వహించే అర్హత లేదని బీఎస్పీ మండల అధ్యక్షుడు వేల్పుల మహేష్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రూప్ టూ అభ్యర్థి ప్రవళిక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా పోటీపరీక్షలకు సిద్ధమవుతూ ఉద్యోగం రాక ఇచ్చిన నోటిఫికేషన్‌లు ఎలక్షన్ కోడ్‌తో రద్దు కావడంతో మనస్థాపానికి గురవుతున్నారన్నారు. స్వరాష్ట్రంలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు దెబ్బడ యాదయ్య, నియోజకవర్గ కార్యదర్శి మైల తిరుపతి, ఈసీ మెంబర్ చెప్యాల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు చిట్యాల అశోక్, మండల కార్యదర్శి వేల్పుల నరేష్‌బాబు, కోశాధికారి చుక్క ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యన్‌సీసీ, యస్‌యన్‌ఐసీ క్యాంప్ కేడెట్లకు శిల్పా రామం సందర్శన

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్





గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హబ్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న యన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో భాగంగా 17 మందిని హైదరాబాద్ పర్యాటక కేంద్రం శిల్పారామానికి తీసుకువెళ్లారు. శనివారం క్యాంపు శిక్షణధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకి ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లారు. ఈ సందర్భంగా శిక్షణ అధికారి మాట్లాడుతూ దేశంలో మొత్తం 17 యన్‌సీసీ డైరెక్టరేట్ల వచ్చిన కేడెట్లకు మొదటగా హైదరాబాద్ పర్యాటక ప్రాంతంగా సందర్శించామన్నారు. ఈ పర్యటనలో భాగంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డు, శిల్పారామంను సందర్శించినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఉదయం క్రీడా నిర్దేతలు ప్రభు, భాను, సంతోష్‌ల సమక్షంలో ఢిల్లీ-పంజాబ్, బీహార్-ఒరిస్సా డైరెక్టరేట్‌ల మధ్య నిర్వహించిన మొదటి జట్టు వాలీబాల్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ క్రీడల్లో ఢిల్లీ, ఒరిస్సాలు గెలుపొందినట్లు క్యాంపు క్రీడా అధికారి లెఫ్టినెంట్ కల్నెల్ జైశ్వాల్ తెలిపారు. ఈ పర్యటనకు పది బస్సులలో 303 యన్‌సీసీ కేడెట్లు, 20 మంది అసోసియేట్ యన్‌సీసీ ఆఫీసర్లు, ఏడుగురు పీఐలు పాల్గొన్నారని లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, లెఫ్టినెంట్ డాక్టర్ మనోజ్‌లు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరికలు







నవతెలంగాణ-తొగుట

బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి యువకులు బీజేపీలో చేరారని మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి 50 మంది కార్యకర్తలు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు విజయం కోసం తాము భాగస్వాములం అవుతామని, దుబ్బాక అభివృద్ధి రఘునందన్ రావుతోనే సాధ్యమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు. గత వారం రోజు ల నుంచి భారతీయ జనతా పార్టీలో భారీ సంఖ్య లో వివిధ పార్టీల నుంచి ప్రజా ప్రతినిధులు నాయకులు చేరుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బీజేపీలో చేరిన వారిలో చిక్కుడు లింగం, పాగల రాజి రెడ్డి, ముచ్చర్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల నాయకులు బండారి వేణు, తొగుట బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గోరిమాండ్ల గణేష్, మండల నాయకులు కాసర్ల నవీన్, సీత శ్రవణ్, సీత మధు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో చందపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షులు స్వామి రెడ్డి, చందు, శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ రెడ్డి, పరమేష్, బాల్ రెడ్డి, మహేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మండలంలోని పెద్దగుండవెళ్లి గ్రామానికి చెందిన 13 మంది యువత ఎంపీ సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దుబ్బాక గడ్డపై తిరిగి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో రఘునందన్ రావు గెలిచి దుబ్బాక ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఇంటికి తరుముతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లుగారి ప్రేమ్, పార్టీ నాయకులు పరమేష్, పర్శా రాములు తదితరులున్నారు.

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువత మెదక్ ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఉపఎన్నికల్లో రఘునందన్ రావు గెలిపించిన యువత నేడు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, గత ఎన్నికల్లో యువతను తన విజయం కోసం వాడుకుని వదిలేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో దుబ్బాక గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, యువత శివ, చింటు, మహేష్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన యువకులు

నవతెలంగాణ-రాయపోల్



ప్రలోభాలకు తలొగ్గి బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన యువకులు తిరిగి బీఆర్ఎస్ పార్టీకి చేరుకున్నారని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన 15 మంది యువకులకు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో గతంలో జరిగిన ఉప ఎన్నికలలో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని కేంద్ర నిధులు తీసుకువచ్చి ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని, రైతులకు, నిరుద్యోగులకు ఎన్నో హామీలను ఇచ్చి అతి తక్కువ ఓట్ల మెజారిటీతో గెలుపొందారన్నారు. గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, రైతుబంధు మండల అధ్యక్షులు మున్న, వడ్డేపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు పెయింటర్ రవి, సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్, జగపతి రెడ్డి, అయ్యగల్ల రవి, చిరంజీవి, నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియామక పత్రం అందుకున్న ఎన్‌సి సంతోష్ గుప్తా

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్‌ను సిద్దిపేట జిల్లా కమిటీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌సి సంతోష్ గుప్తా, కుంటనోళ్ల శివకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులను నియమించారన్నారు. నియామక పత్రాన్ని హైదరాబాద్ ఒలింపిక్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్‌తో అందుకున్నామన్నారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన అధ్యక్షులు చిన్న నేతి సంతోష్, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్‌కు అందజేయడం జరిగిందన్నారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, అధ్యక్షులు నేతి చిన్న సంతోష్, వైస్ చైర్మన్ మహ్మద్ జుబైర్ పాషా, మహిళా కమిషన్ చైర్మన్ దుండుగుల రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివకుమార్, కోశాధికారి కుంట సత్యం ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గద్దల రమేష్, సంపంగి రాజు, రంగనాథ్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్, చిల్లీ మహేష్, అంగడి నరేంద్ర బాబు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల ప్రాంతంపై అవగాహన లేని పల్లా

- జేఏసీ నాయకులపై ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- జేఏసీ చైర్మన్ పరమేశ్వర్, నాయకులు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటాలు నిర్వహిస్తున్న జేఏసీ నాయకులపై పట్టభద్రుల ఎమ్మెల్సీ, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, నాయకులు ఆముదాల మల్లారెడ్డి, మంచాల చిరంజీవులు, అందె అశోక్, బూరుగు సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజల విశిష్టత, ఆత్మగౌరవ పోరాటంలో నాలుగు మండలాల ప్రజలు భాగస్వాములై గత ఏడు సంవత్సరాలుగా డివిజన్ సాధన కోసం శాంతియుతంగా పోరాటాలు నిర్వహిస్తున్న నాయకులపై రాజేశ్వర్ రెడ్డి ఇటీవల జరిగిన ఓ సమావేశంలో జేఏసీ నాయకులను పిడికెడంత మంది రాజకీయ నిరుద్యోగులు దీక్షలు చేస్తున్నారని, జేఏసీ నాయకులు అంతా కలిసినా ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తతో కూడా సమానం కాదన్నారని వాపోయారు. ఓట్ల కోసం ఆరాటపడకుండా మొదలు ఈ ప్రాంత సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యల పట్ల అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, చేర్యాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఉడుముల భాస్కర్ రెడ్డి, సర్పంచ్ తాడూరి రవీందర్, టీడీపీ మండల అధ్యక్షులు కూరారం బాల నరసయ్య, కొంగరి వెంకటమావో, ఈరి భూమయ్య, మిట్టపల్లి నారాయణ రెడ్డి, ఆలేటి యాదగిరి, సనాది భాస్కర్, బిజ్జ రాము, పోతుగంటి ప్రసాద్, కత్తుల భాస్కర్ రెడ్డి, బోయిని మల్లేశం, జంగిలి యాదగిరి, తాడెం వెంకట స్వామి, ఈరి మల్లయ్య, గర్నపల్లి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలను అడ్డం పెట్టుకొని సెంటిమెంట్ రాజకీయాలు

- కరీంనగర్ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ఎన్నికలను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. శనివారం హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి మించిన మరొక రాజకీయ పార్టీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఇందుకు నిదర్శనమన్నారు. హుస్నాబాద్‌పై కేసీఆర్ సెంటిమెంట్ ఉన్నంత అభివృద్ధి ఎక్కడని ప్రశ్నించారు. హుస్నాబాద్ నుంచి వరంగల్ వైపు హుజురాబాద్ నుంచి కరీంనగర్ వైపు ఎక్కడా వెతికినా బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కనబడటం లేదన్నారు. హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజీ ఎందుకు ఏర్పాటు చేయలేదని, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ఏం చేశారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి గురించి స్థానిక శాసన సభ్యుడు ఎందుకు గళం విప్పడం లేదన్నారు. కాంగ్రెస్ ఆరు క్లారిటీలు ప్రామిసరీ నోట్ల లాంటివి, ఆర్ గ్యారంటీలపై ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలను ఆశ్రయిస్తే నేరుగా మీ ఇంటి వద్దకే వచ్చి ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కెడం లింగమూర్తి , బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు బంక చందు, జంగపల్లి ఐలయ్య, వేన్న రాజు చిత్తరి రవీందర్ పాల్గొన్నారు.

## దేశంలోనే సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్

- సిద్ధమైన బారాస ఎన్నికల మేనిఫెస్టో
- రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి పథంలో తెలంగాణ నెంబర్ వన్‌లో ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ లో ఆదివారం జరిగే కేసీఆర్ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే సతీష్ కుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించుకున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా ఇంటింటికి మంచినీరు మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్నామన్నారు. ప్రజా ఆశీర్వాద సభకు సర్వం సిద్ధమైందని, గులాబీదండు లక్షలాదిగా తరలివచ్చి సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను ఆశీర్వదించనున్నారన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు అన్ని గ్రామాల నుంచి మహిళలు, నాయకులు, అభిమానులు ప్రజలు తరలివస్తారని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే సతీష్ కుమార్ తెలిపారు. మూడవసారి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రజలందరూ తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించాలని సతీష్ కుమార్ కోరారు.

## బాధిత కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-దుబ్బాక

అనారోగ్యంతో మరణించిన దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట 8వ వార్డుకు చెందిన ఎంగల చిన్నయ్య కుటుంబ సభ్యులను వార్డు కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణ గౌడ్ శనివారం పరామర్శించారు. ఎంగల చిన్నయ్యది పేద కుటుంబమని తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 వేలు అందజేశారు. 8వ వార్డు ప్రజలకు ఆపదలో అండగా తాను ఉంటానని తెలిపారు.

## గౌడన్నలు సామాజికంగా, అర్థికంగా ఎదగాలి

నవతెలంగాణ-మర్కుక్



గౌడన్నలు సామాజికంగా, అర్థికంగా, రాజకీయంగా ఎదిగి అన్ని రంగాలలో రాణించాలని గౌడజన్న హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పాములపర్తి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మర్కుక్ కట్ట మైసమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో ఈత మొక్కలను మర్కుక్, పాములపర్తి గౌడన్నలతో మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌తో కలసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 4732 సొసైటీలు, 5284టిఎఫ్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణలో 2.24 లక్షల సభ్యత్వాలు ఉన్నాయన్నారు. ఈత చెట్లు వుంటేనే వృత్తి ఉంటుందని, గౌడన్నలు ఈత వనాలను విరివిగా నాటి సంరక్షించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్లు దుకాణాలను పున: ప్రారంభించడంతో గౌడన్నలు అర్థికంగా ఎదుగుదలకు దోహదపడిందన్నా రు. ఈ కార్యక్రమంలో గౌడజన్న హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూదరి రాజు గౌడ్, స్వామిగౌడ్, ఆత్మ కమిటి డైరెక్టర్ యావగారి సంతోష్ రెడ్డి, గౌడ సంఘం నాయకులు బబ్బూరి మల్లేశం, శీనివాస్ గౌడ్, సిలివేరి కిష్టాగౌడ్, నర్సింలు గౌడ్,రాజేష్ గౌడ్, చంద్రం గౌడ్, కె.స్వామి గౌడ్, బాబు గౌడ్, సాయిగౌడ్, గిరి గౌడ్ తదితరులున్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు రంగమైన పరశురాములు

నవతెలంగాణ-మిరు దొడ్డి



మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు రంగమైన పరశురాములు అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని పెద్ద చెరువులో సబ్సిడీ చేప పిల్లలను ముదిరాజ్ కులస్తులు చెరువులో వదిలారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 20,300 చేప పిల్లలను 100% సబ్సిడీపై అందజేశారన్నారు. గతంలో మత్స్యకారులకు ఉపాధి లేక ఇబ్బందులకు గురయ్యే వాళ్ళమని, ప్రభుత్వ సహకారంతో మత్స్యకారులకు నేడు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ముదిరాజ్ సంఘం నాయకులు చంద్రయ్య, నర్సింలు, ఎల్లం, రమేష్, వెంకట్, కనకయ్య, కిషోర్, యాదగిరి, నర్సింలు పలువురు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్



మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన గౌరోల్ల రాజవ్వ(85) ఇటీవల మృతి చెందారు. శనివారం మర్కుక్ బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ భాస్కర్, ఆత్మకమిటి డైరెక్టర్ సంతోష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొర్సు శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.

# వృద్ధురాలు అదృశ్యం



నవతెలంగాణ-దుబ్బాక

మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వి.గంగరాజు తెలిపిన వివరాల మేరకు దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన బాలుగారి జోగవ్వ (75) గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడి మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి 10 గంటలకు తిని పడుకున్నారు. ఈనెల 12న ఉదయం ఐదింటికి లేచి చూసేసరికి జోగవ్వ కనబడలేదు. చుట్టుపక్కల వెతికి బంధువులకు సమాచారం అందించినా జోగవ్వ ఆచూకీ లభ్యం కాలేదు. జోగవ్వ కుమారుడు బాలుగారి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై గంగరాజు తెలిపారు.

## దుబ్బాకలో వాహన తనిఖీలు

నవతెలంగాణ-దుబ్బాక



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి తొలిసారిగా ఎలక్షన్ ఆఫీసర్ ఎస్.యాదవ రెడ్డి నేతృత్వంలో శనివారం దుబ్బాక పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహ కూడలి వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజ్ కుమార్ గౌడ్ వాహనం, ఇతర వాహనాలు తనిఖీ చేశారు.

## కేసీఆర్‌కు లక్ష మెజార్టీ ఖాయం

- మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్



ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష మెజార్టీతో గెలుస్తారని ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 20 వార్డులో ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్లు కూడా రావని, సీఎం కేసీఆర్‌కు భారీ మెజార్టీ వచ్చేలా చూస్తామన్నారు. గజ్వేల్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే సీఎం కేసీఆర్ కృషియేనన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే అన్నారు.